ప్రజాశక్తి
మంగళవారం 3 జూన్ 2025 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయాలి

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి. కృష్ణయ్య

రైతులతో మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

ప్రజాశక్తి -పర్చూరు

పర్చూరు ప్రాంతంలో రైతుల వద్ద నిల్వ ఉన్న నల్లబర్లీ పొగాకును పొగాకు కంపెనీలు వెంటనే కొనుగోలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి. కష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం పర్చూరు విచ్చేసిన కష్ణయ్య ఇటీవల ఉప్పుటూరు గ్రామంలో కురిసిన వర్షాలకు తడిసిన పొగాకు మండేలను పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షంలో తడిసిన పొగాకు రంగు మారిందని, నాణ్యత తగ్గుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం కృష్ణయ్య పర్చూరులో రైతులతో మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దని, ధైర్యంగా ఉండాలని రైతులకు సూచించారు. రైతుల వద్ద ఎంత పొగాకు ఉందో ఇటీవల వ్యవసాయ, సచివాలయ సిబ్బంది లెక్కలు వేశారని, దాని ప్రకారం రైతులకు టోకెన్లు మంజూరు చేసి పొగాకును కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కృష్ణయ్య కోరారు. పొగాకు రైతుల సమస్య పరిష్కారానికి గుంటూరులోని జిపిఐ పొగాకు కంపెనీ వద్ద ఈనెల 5న ఉదయం 10 గంటలకు రైతులతో ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పర్చూరు ప్రాంత పొగాకు రైతులు పెద్ద సంఖ్యలో ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.శ్రీనివాసరావు, ఎం.డేవిడ్ ,ఎస్కె. రహీం,రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రతో శ్యామల కాశిరెడ్డి

రైతు సంక్షేమానికి ప్రత్యేక ప్రణాళికలు

- డిసిఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి

▶ 8 లో

తొలి ఏడాదికి రాజకీయ వేడి

- హామీల అమలుకు పాలకపక్షం కుస్తీలు
- ఫలితాల రోజును వెన్నుపోటు దినంగా పాటిస్తూ వైసిపి నిరసన

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

ఎన్నికల ఫలితాలు విడుదలై ఈనెల 4వ తేదీకి ఏడాది పూర్తికానుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొలి ఏడాదిని పూర్తిచేసుకుంటోంది. ఏడాది పాలనలో ఏం చేశామన్న దానిపై పాలకపక్షం మహానాడు కార్యక్రమాల్లో వెల్లడించింది. నియోజకవర్గం మొదలు జిల్లా ఆ తర్వాత రాష్ట్ర మహానాడు కార్యక్రమాలు నిర్వహించారు. ఏడాదిలో ఏం చేశామనే విషయంపై టిడిపి నేతలు ఆర్భాటంగానే చెప్పారు. రాష్ట్రంలో హామీల అమలును ప్రస్తావించారు. నియోజక వర్గాలు, జిల్లాస్థాయి సమస్యలపై మరోసారి తీర్మానాలు చేశారు. వాటిని పూర్తిచేస్తామని, రానున్నరోజుల్లో జిల్లాలను సస్యశ్యామలం చేస్తామన్నారు. ఇక ఏడాదిలో ఏమీ చేయలేదని, ఎన్నికల ఫలితాల రోజును వెన్నుపోటు దినంగా నిరసన కార్యక్రమాలకు వైసిపి పిలుపునిచ్చింది. వైసిపి జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మీడియా సమావేశంలో కూటమి ప్రభుత్వంపై తనదైనశైలిలో విమర్శలు చేశారు. పార్టీపరంగా చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని వెల్లడించారు.అదే రోజున జడ్‌పి సమావేశం కావడంతో ఆయన ప్రకటనతో పాలకపక్షం నుంచి ఎక్కువ మంది ఎమ్మెల్యేలు హాజరు కాలేదు. మంత్రి డోలా సమావేశానికి హాజరవుతారని భావించినా ఆయన కూడా రాలేదు. ఇక్కడే రాజకీయవేడి రగిలింది. బూచేపల్లి ప్రకటనపై మంత్రి డోలావీరాంజనేయస్వామి ఘాటుగా స్పందించారు. తన నియోజకవర్గంలో పించన్ల పంపిణీ కార్యక్రమం సందర్భంగా ఆయన

మాట్లాడారు. వైఎస్.జగన్‌ను ప్రజలు ఛీత్కరించుకుని 11 సీట్లు ఇచ్చారని,ప్రజాతీర్పు రోజును వెన్నుపోటు దినంగా చెప్పడం సిగ్గుచేటన్నారు.గతంలో ఆయనకు అధికారం ఇచ్చిన ప్రజలకు వెన్నుపోటు పొడవడం వల్లే ఈ ఎన్నికల్లో దారుణ పరిస్థితిని చవి చూశారన్నారు. రెండు పార్టీల నడుమ మరోసారి రాజకీయ రగడమొదలైంది. ఏడాది పాలనపై తెలుగుదేశం నేతలు మహానాడు సభల్లో ఆర్భాటంగా చెప్పారు. అనేక హామీలను నెరవేర్చుతామని వాటిని మరోసారి తీర్మానాలు చేశారు. ఏడాదిలో ఎన్నికల మేనిఫెస్టో అమలు కాకపోవడం వైసిపికి అస్త్రంగా మారింది. సూపర్‌సిక్స్‌లో కేవలం ఒక హామీ మాత్రమే అమలైంది. ఏడాదిగా మిగతా పథకాలతాలూకు లబ్ధిని ప్రజలు కోల్పోయారు. ఈ విషయాన్ని వైసిపి ప్రజల్లోకి తీసుకుపోతోంది. వాస్తవానికి ఏడాదిలో పాలకపక్షం ఇచ్చిన కొన్ని కీలకహామీలు అమలు విషయం అలా ఉంచితే కనీసం వాటికి సంబంధించిన పనులుగానీ, చర్యలుగానీ మొదలు కాలేదు. వెలిగొండ ప్రాజెక్టును ఏడాదిలోపు పూర్తిచేస్తామన్నారు. తర్వాత రెండేళ్లు అన్నారు. అయితే దీని పనులు మొదలు కాలేదు. నత్తనడకన సాగుతున్నాయి. ఎన్నికల్లో ప్రచారాస్త్రంగానే మారింది. కారణమేమిటోగానీ వెలిగొండ ప్రాజెక్టుపై సిఎం చంద్రబాబు అంతగా ఆసక్తి చూపలేదని గతం నుంచి సాగుతోన్న ప్రచారానికి ఇపుడు ఏమీ చేపట్టకపోవడం ఊతమిస్తోంది. పైగా నిర్వాసితులకు ప్యాకేజీలు కూడా ఇవ్వలేదు. నిర్వాసితులు ఏడాదిగా ఎదురు చూస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో పశ్చిమాన ఇచ్చిన హామీలు అన్నీ అలాగే ఉన్నాయి. మార్కాపురం జిల్లా ఏర్పాటు ఎండమావిగానే మారింది. దీనిపై

▶ 2లో

వామ్మో పులి..!

- నల్లమల అటవీ ప్రాంతం నుంచి జనారణ్యంలోకి పులులు
- భయాందోళనలో రైతులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న అటవీ శాఖాధికారులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

నల్లమల లోతట్టు అటవీ ప్రాంతంలోని గంజివారిపల్లి, కొలుకుల గ్రామాల మధ్య ఉన్న అటవీ ప్రాంతాల్లో పెద్దపులి సంచరిస్తోంది. గత వారం రోజులుగా పొలాలకు వెళ్లే రైతులకు పెద్దపులి కంట పడుతుంది. దీంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. అటవి ప్రాంతాని వదిలి గ్రామాల బాట పట్టిన పెద్ద పులుల గురించి అటవీ శాఖాధికారులకు తెలపడంతో వారు కూడా అప్రమత్తమయ్యారు. గంజివారిపల్లి, వెంకటాద్రిపాలెం రోడ్డులో పెద్దపులి రోడ్డును దాటడాన్ని గుర్తించిన ఓ వ్యక్తి అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని పులి జాడ కోసం అన్వేషణ చేపట్టారు. అదే ప్రాంతంలో మూడు రోజుల క్రితం అడవి పందిని పులి వేటాడినట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు. దీంతో నల్లమల అడవికి అతి సమీపంలో ఉన్న గంజివారిపల్లి గ్రామ ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ప్రారంభించాల్సిన సమయం కావడంతో పొలాల్లోకి వెళ్లేందుకు రైతులు భయాందోళన చెందుతున్నారు. అటవీ శాఖ అధికారులు హైఅలర్ట్ ప్రకటించారు. ప్రత్యేక గస్తీ బందాలు నియమించి పులి సంచార ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రజల భద్రత తమ ముఖ్యమని అవసరమైతే డ్రోన్ కెమెరాల సహాయంతోనూ పులి సంచారాన్ని గమనిస్తాని చెబుతున్నారు. ఈ సందర్భంగా గంజివారిపల్లి అటవీ శాఖ క్షేత్రాధికారి ఎస్‌వి.సుబ్బారావు మాట్లాడుతూ గ్రామస్తులు రాత్రివేళలు తప్పక ఇంట్లోనే ఉండాలన్నారు. ఒంటరిగా అటవీ

▶ 2లో

చీరాల చైర్మన్ పీఠం రూ. కోటి..?

- చైర్మన్ ఎంపికలో తొలగని ప్రతిష్టంభన
- మల్లగుల్లాలు పడుతున్న నేతలు

చీరాల మున్సిపల్ కార్యాలయం

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

చీరాల మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావును పదవి నుంచి దింపి మరొకరిని చైర్మన్ చేయడం కోటి రూపాయలకు పైగా ఖర్చు అయ్యే ప్రాజెక్టుగా మారింది.ఇప్పుడున్న పరిస్థితుల్లో కోటికి పైగా ఖర్చు పెట్టగలిగిన వారే చైర్మర్ స్థానాన్ని దక్కించుకొనే పరిస్థితి జరుగుతున్న పరిణామాలను బట్టి తెలుస్తుంది. చైర్మన్ పదవిని ఆశిస్తున్న వారి సంఖ్య ఆరుకు పైగా ఉంది. దీంతో వీరిలో ఎవరిని ఎంపిక చేయాలి, ఏ ప్రాతిపదికన ఎంపిక చేయాలనే విషయంలో అధికార పార్టీ నేతలు మల్లగుల్లాలు పడుతున్నట్లు సమాచారం చీరాల మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబుపై గత నెల 14న అవిశ్వాస తీర్మానం పెట్టారు. మెజారిటీ కౌన్సిలర్లు అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు వేశారు. అదే రోజు మరో వైస్ చైర్మన్ శిఖాకొల్లి రామసుబ్బులు కూడా తన పదవికి రాజీనామా చేశారు. దీంతో చైర్మన్, రెండు వైస్ చైర్మన్ స్థానాలు ఖాళీ అయ్యాయి. త్వరలోనే ఈ స్థానాలకు ఎన్నిక జరగాల్సి ఉంది. గత మున్సిపల్ ఎన్నికల సమయంలో చైర్మన్ పదవిని ఆశించి భంగపడిన వైసిపికి చెందిన మున్సిపల్ కౌన్సిలర్లు గత ఎన్నికల సమయంలో కొందరు, కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక మరి కొందరు టిడిపిలో చేరారు. చైర్మన్ పదవిని

▶ 2లో

చీరాల చైర్మన్ పీఠం రూ.కోటి..?

(మొదటిపేజీ తరువాయి)

ఆశిస్తున్నవారు స్థానిక ఎమ్మెల్యే మాలకొండయ్యపై ఒత్తిడి తెచ్చి అవిశ్వాస తీర్మానం పెట్టించారు. చైర్మన్ మార్పుడం ద్వారా తమకు కూడా ఆర్థిక లబ్ధి చేకూరుతుందనే కారణంతో మెజారిటీ కౌన్సిలర్లు అధికార టిడిపికి జై కొట్టారు. అవిశ్వాసం నెగ్గించుకునే సమయంలో కొందరు కౌన్సిలర్లు భారీగా ఆర్థిక లబ్ధి పొందారు.అవిశ్వాస తీర్మానం నెగ్గాక తమలో ఎవరు చైర్మన్ అవ్వాలనే విషయంలో ఏకాభిప్రాయానికి రాలేక పోతున్నారు. మీలో ఒకరి పేరును మెజారిటీ కౌన్సిలర్ల ఆమోదంతో తెలపాలని ఎమ్మెల్యే కొండయ్య తన మాటగా చెప్పారు. మీరే చైర్మన్‌ను ఎంపిక చేయాలని కౌన్సిలర్లు ఎమ్మెల్యేను కోరినట్లు తెలుస్తుంది. ఒకరిద్దరు కౌన్సిలర్లు తమ మద్దతుదారులతో ఎమ్మెల్యేను కలిసి చైర్మన్ స్థానాన్ని తమకు కేటాయించాలని కోరారు. అవిశ్వాస తీర్మానం ప్రయత్నాలు మొదలు పెట్టాక కౌన్సిలర్ల క్యాంపు ఖర్చులు,తీర్మానం సమయంలో కొందరు కౌన్సిలర్లను తమ వైపు తిప్పుకునేందుకు నగదు చెల్లింపులు జరిపినట్లు చెబుతున్నారు. ఈ ఖర్చు మొత్తం రూ.65 లక్షలుగా తేల్చారు. ఈ నెలలో నూతన చైర్మన్ ఎన్నిక జరగాల్సి ఉన్న నేపథ్యంలో మెజారిటీ కౌన్సిలర్ల మద్దతు ఓట్ల కోసం మరి కొంత ఖర్చు తప్పేలా లేదు. అందు కోసం మరో రూ.35 నుంచి రూ.50 లక్షల మేర అవసర మని అంచనాలు ఉన్నాయి. అందువలన కోటి రూపాయలు పైగా ఖర్చు పెట్టగలిగిన వారు చైర్మన్ స్థానాన్ని ఆశిస్తూ ముందుకు రావచ్చని చెబుతున్నారు. మున్సిపల్ పరిభాషలో చెప్పాలంటే చైర్మన్ పదవి కోసం ఓపెన్ టెండర్లు పిలిచినట్లయింది. చైర్మన్ పదవితో పాటు రెండు వైస్ చైర్మన్ స్థానాలకు ఎంపిక జరగాల్సి ఉంది. టిడిపి పట్టణ అధ్యక్షుడి పదవి కూడా దీంతోనే ముడిపడి ఉంది.ఎస్‌సి, ఆర్య వైశ్య వర్గానికి చెందిన వారు వైస్ చైర్మన్ పదవిని కోల్పోయినందున ఒండు స్థానాల్లో ఆ వర్గాల వారినే ఎంపిక చేస్తారని భావిస్తున్నారు. కౌన్సిలర్లు మించాల సాంబశివరావు, పొత్తూరి సుబ్బయ్య, సూరగాని లక్ష్మి, గోలి స్వాతి, మామిడాల రాములు, దాసరి శారద మున్సిపల్ చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. చైర్మన్ పదవికి కేవలం 8 నెలల గడువు మాత్రమే ఉంది. దీంతో ఈ పదవి కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి రావడంతో ఈ పదవిని ఆశిస్తున్న ఒకరిద్దరు కౌన్సిలర్లు వెనుకడుగు వేసినట్లు తెలుస్తుంది.

ఎనిమిది నెలల కాలంలో పెట్టిన ఖర్చులో కొంత మొత్తం కూడా వెనక్కు వచ్చే పరిస్థితి లేదు.ఆర్థిక స్తోమత ఉన్నవారు, మున్సిపల్ చైర్మన్ అనే అధికార ధర్పం కోసం మాత్రమే అంత పెద్ద మొత్తంలో ఖర్చు పెట్టగలరు. ఈ నేపథ్యంలో చైర్మన్ పదవిని ఆశిస్తున్న వారు రూ.50 నుంచి రూ.60 లక్షల వరకూ ఖర్చు పెట్టాలనే భావనతో ఉన్నారు. మున్సిపల్ చైర్మన్ పదవి కోసం ఎంత అయినా ఖర్చు పెట్టగలమనే వారిలో ఇద్దరు మాత్రమే ఉన్నట్లు తెలుస్తుంది. చైర్మన్ ఎంపికలో క్యాస్ట్ కంటే క్యాషే ఎక్కువ ప్రభావం చూపనున్న తరుణంలో చైర్మన్ ఎవరనే విషయం ప్రస్తుతానికి అంతుపట్టనిదిగా ఉంది. అవిశ్వాస తీర్మానం అంశం చర్చకు వచ్చిన సమయంలో ఉన్న ఊపుని బట్టి చూస్తే ఇప్పటికే చైర్మన్ ఎంపిక కోసం తేదీలు ఖరారు కావాలి. చైర్మన్ ఎంపిక తేలకనే జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తుంది. ఓపెన్ టెండర్‌లో ఎవరు ఎక్కువ మొత్తంలో కోట్ చేస్తే వారు చైర్మన్ అవుతారు. అందుకు ఎవరూ ముందుకు రాకపోతే ఎమ్మెల్యే కొండయ్య తమకు అనుకూలంగా ఉండే వ్యక్తి చైర్మన్ ఎంపిక చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

వామ్మో పులి,,!

(మొదటిపేజీ తరువాయి)

పొంతానికి వెళ్లకూడదని చెప్పారు. చిన్నారులను ఒంటరిగా బయటకు పంపొద్దని సూచించారు. చుట్టుపక్కల ఎక్కడైనా పులి సంచరిస్తున్నట్లు కనబడితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

ఈ పాటికే పులి వేలిముద్రలను సేకరిస్తున్నామని తెలిపారు. తమ రేంజ్ పరిధిలో 16 పులులు ఉన్నట్లు తెలిపారు. గ్రామస్తులు అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలన్నారు. పులుల వల్ల గ్రామస్తులకు ఎలాంటి అపాయం కలుగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

ఆర్టీసీ బస్టాండులను శుభ్రంగా ఉంచాలి

ఆర్‌టిసి జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

ఒక మార్కాపురంలోనే కాదు.. అన్ని ప్రాంతాల్లోని ఆర్‌టిసి బస్టాండులన్నీ పరిశుభ్రంగా ఉంచాలని, కరోనా విస్తరిస్తున్న తరుణంలో ఈ చర్యలు తప్పవని ప్రకాశం, నెల్లూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల ఆర్‌టిసి జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ఆర్‌టిసి అధికారులకు సూచించారు. మార్కాపురం ఆర్‌టిసి బస్టాండుతో పాటు డిపోను సోమవారం ఆయన పరిశీలించారు. ఆర్‌టిసి బస్టాండు అపరిశుభ్రతపై అసహనం వ్యక్తం చేశారు. ఇకపై ఇలా ఉండటానికి వీల్లేదని అధికారులపై మండిపడ్డారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆర్‌టిసిని పట్టించుకోలేదన్నారు. రాష్ట్రంలో కూటమి సర్కార్ ఏర్పడిన తరువాత ఆర్‌టిసి ఆదాయం పెంచేందుకు మార్గం అన్వేషిస్తున్నామని చెప్పారు. కేంద్రం సబ్సిడీతో రాష్ట్రానికి 2,900 ఎలక్ట్రిక్ బస్సులు త్వరలో రాబోతున్నాయని అన్నారు. వీటితో పాటు రాష్ట్ర ప్రభుత్వం మరో 950 బస్సులు కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు. వచ్చే ఆగస్టు 15 నుంచి ఆర్టీసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించే విషయమై కసరత్తు జరుగుతోందన్నారు. ఆర్టీసీ ఆదాయాన్ని పెంచేందుకు ప్రయాణికులు సహకరించాలన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని విజ్ఞప్తి చేశారు. ఆయనతో పాటు ఉన్నతాధికారులు, మార్కాపురం డిపో మేనేజర్ ఎఎస్ నరసింహులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

వైసీపీ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న వెన్నుపోటు దినం సందర్భంగా యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆదేశాల మేరకు దోర్నాలలోని శివసదనంలో వెన్నుపోటు దినం గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఘంటా వెంకట రమణారెడ్డి, గుమ్మా యలేష్ యాదవ్, గొలమారి రాజశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, దర్శనం నాగయ్య, రసూల్, శివారెడ్డి, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అవసరం

ప్రజాశక్తి-గిద్దలూరు

విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అవసరం అని గిద్దలూరు అర్బన్ సిఐ కె సురేష్ అన్నారు. సోమవారం స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మారుతున్న కాలంలో విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అవసరం అని అన్నారు. ఉపాధ్యాయులు కూడా బాల్యం నుంచే విద్యార్థులకు నైతిక విలువలు నేర్పాలని సూచించారు. విద్యార్థులకు చదువు కేవలం ఉద్యోగం కోసమే కాకుండా విజ్ఞానంతో పాటు వివేకాన్ని అందించేలా ఉండాలని, చదువుతోపాటు చక్కని క్రమశిక్షణను అలవర్చుకొని, ముఖ్యంగా తల్లిదండ్రులు, గురువుల పట్ల వినయ విధేయతలతో ఒదిగి ఉన్నప్పుడే భవిష్యత్తులో గొప్పవారుగా తయారవుతారని అన్నారు. విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకుని అనుకున్న ఆశయాలను ఆశలను సాధించి భావితరాలవారికి స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రంథ

మాట్లాడుతున్న సిఐ సురేష్

పాలకురాలు ఎన్ ప్రసన్న కుమారి, విశ్రాంత ఉపాధ్యాయులు బి రామిరెడ్డి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ మొర్రి పిచ్చయ్య, తెలుగు ఉపాధ్యాయులు అలిశెట్టి బాలవెంకటేశ్వర్లు, యువ ప్రగతి పథం సంస్థ వ్యవస్థాపకులు ఎస్‌డి ఫరూఖ్, నిత్యసాయి తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనేక వాగ్దానాలు చేశారన్నారు. వాటిని అమలు పరచడంలో జాప్యం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సంక్షోభంలో ఉన్నదని పదేపదే చెబుతున్నారు. అపార అనుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఉన్న ఆర్థిక పరిస్థితి తెలియదా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో రాష్ట్రంలో 32 లక్షల ఇళ్ల స్థలాల నిర్మాణం చేపట్టిందని వాటిల్లో 50 శాతం కూడా పూర్తి కాలేదని, ఆగిపోయిన నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలలో ఇచ్చిన హామీలో భాగంగా పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాల ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఇచ్చి నిర్మాణం చేపట్టాలని, సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కెవి కృష్ణగౌడ్, నక్కా తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

తొలి ఏడాదికి రాజకీయ వేడి

(మొదటిపేజీ తరువాయి)

మంత్రులతో కమిటీ వేశారు. ఏ కమిటీలు లేకుండానే గత ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న కొద్ది రోజుల్లోనే జిల్లాలను ఏర్పాటు చేసింది. చేర్పులు మార్పులకు ఏడాది పట్టిందా? అసలు కమిటీ అంటే కాలయాపన తప్ప చర్యలు ఉండవనే చర్చ సాగుతోంది. ఈరెండు హామీలపై జిల్లా మహానాడులో తీర్మానం చేశారు. ఇంకా జిల్లా డెయిరీ అలాగే మూతపడింది. దాన్ని తెరిపించే చర్యలు లేవు. తాగునీరు, సాగునీటి ప్రాజెక్టులు అతీగతీలేవు. ఇంటింటికీ కుళాయి ఎండమావిగానే మారింది. పశ్చిమ ప్రాంతానికి ఇప్పటికీ తాగునీరు ట్యాంకర్లతోనే అందజేస్తున్నారు. డిఆర్‌సిలో చేసిన తీర్మానాలు కూడా వీటిపైనే. ఎక్కడ చర్చలు సాగినా.. తీర్మానాలు చేసినా అమలు కాలేదు. ఇక్కడే వైసిపికి విమర్శించడానికి సమయం వచ్చింది. ఇక ముందుకు వచ్చిన సమస్యలపైనా నిర్లక్ష్యం కొనసాగుతోంది. మొన్నటి వరకూ మిర్చి రైతులు సంక్షోభంలో ఉన్నారు.ఇపుడు పొగాకు రైతులు చేరారు. రోడ్డెక్కుతున్నారు. ధరల్లేవు. వ్యాపారుల దోపిడీ కొనసాగుతోంది. ప్రభుత్వ రంగసంస్థల జాడలేదు. మార్కెట్‌లో సంక్షోభం నివారి ంచేందుకు తీసుకున్న చర్యలు పూజ్యం. నియోజకవర్గాల్లోనూ అభివృద్ధి పనులు వేగంగా లేవనే చర్చ పాలక పక్షంలోనే సాగుతోంది. అన్నిటికి నిధుల సమస్య వెంటాడుతోంది. ఏదేమైనా తొలిఏడాది హామీల అమలుపై కుస్తీలే కొనసాగుతున్నాయి. ఇక వైసిపికి కూడా కొన్ని అంశాలు కలిసి రావడంతో తిరిగి ప్రజలను సమీకరించి ఆందోళనలు చేపట్టేందుకు సన్నద్ధమవుతోంది.

CHANGE OF SURNAME

I, **VADDELLA VANITHA** (Old name), D/O **GUDIPUDI VENKATA RAO** resident of H.No. 2-1. Main Road. MaddiralaPadu, Prakasam District, Andhra Pradesh - 523262 , India I, have Changed my Surname as **GUDIPUDI VANITHA** (New Name) D/O **GUDIPUDI VENKATA RAO** Hereafter my Surname is known as **GUDIPUDI VANITHA** (New Name) D/O **GUDIPUDI VENKATA RAO**

Before The Honourable Deputy Registrar Of Chits at Nellore
(Application for reference of a Dispute)
Dispute No. 197 of 2023

Vajrankura Chit Funds Pvt.Ltd., Kavali, represented by its Legal Officer, Md.Gouse Mohiuddin, Being authorized person. ... Disputant.

Versus

1. Mr. **Kanta Mahesh** and 2 Others ... Opponents.

Notice

To,
Opp-1. Mr. **Kanta Mahesh,**
S/o **Nageswara Rao,** Occ: Business, R/o H.No.60, Janardhana Puram Village, Jarugumilli Mandal, Prakasam District-523271.

పై నెంబరున డిస్‌ప్యూటెంట్ మీ నుండి చిట్ బాకీ బ్యాలెన్స్ మొత్తం రాబట్టుకొనుటకు పైన తెలిపిన డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, నెల్లూరు వారి ఆఫీసులో కేసు దాఖలు చేసియున్నారు. సదరు కేసులో మీకు నోటీసు నిమిత్తం **తే20-06-2025ది**కి వాయి వేసియున్నారు. కావున వాయిదా రోజు **ఉదయం 11.00 గంటలకు** మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పైన తెలిపిన డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, నెల్లూరు వారి ఆఫీసులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

జె.సురేష్ బాబు,
కె.నవకోటి,
వి.రాజ్యలక్ష్మి,
అడ్వకేట్స్
డోర్ నెం.25/3/2, కె.బి.ఆర్. మాల్, 2వ ఫ్లోర్, పద్మావతి సెంటర్, పొదలకూరు రోడ్డు, నెల్లూరు టౌన్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

Before The Honourable Deputy Registrar Of Chits at Nellore
(Application for reference of a Dispute)
Dispute No. 195 of 2023

Vajrankura Chit Funds Pvt.Ltd., Kavali, represented by its Legal Officer, Md.Gouse Mohiuddin, Being authorized person. ... Disputant.

Versus

1. Mr. **Idamakanti Amaranath Reddy** and 4 Others ... Opponents.

Notice

To,
Opp-5. Mr. **Kanta Mahesh,**
S/o **Nageswara Rao,** Occ: Business, R/o H.No.60, Janardhana Puram Village, Jarugumilli Mandal, Prakasam District-523271.

పై నెంబరున డిస్‌ప్యూటెంట్ మీ నుండి చిట్ బాకీ బ్యాలెన్స్ మొత్తం రాబట్టుకొనుటకు పైన తెలిపిన డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, నెల్లూరు వారి ఆఫీసులో కేసు దాఖలు చేసియున్నారు. సదరు కేసులో మీకు నోటీసు నిమిత్తం **తే20-06-2025ది**కి వాయి వేసియున్నారు. కావున వాయిదా రోజు **ఉదయం 11.00 గంటలకు** మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పైన తెలిపిన డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, నెల్లూరు వారి ఆఫీసులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

జె.సురేష్ బాబు,
కె.నవకోటి,
వి.రాజ్యలక్ష్మి,
అడ్వకేట్స్
డోర్ నెం.25/3/2, కె.బి.ఆర్. మాల్, 2వ ఫ్లోర్, పద్మావతి సెంటర్, పొదలకూరు రోడ్డు, నెల్లూరు టౌన్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

మహారాజశ్రీ మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి. నెం: 130/2023
ఇన్
ఓ.ఎస్. నెం: 398/2019

అల్లు చిన్న మల్లయ్య అలియాస్ చిన్న మల్లారెడ్డి ...డి.హెచ్.ఆర్

వర్సెస్

1) పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి (చనిపోయినందున ఇతరులు)
2) పోతిరెడ్డి అంకాలమ్మ మరియు ఇతరులు ...జె.డి.ఆర్స్

టు,
ఆర్-4: పోతిరెడ్డి అంజమ్మ, తండ్రి: వెంకటేశ్వరరెడ్డి, వయసు: 25 సం॥, హిందూ,
నివాసం: పుచ్చకాయలపల్లి గ్రామం, పెద్దారవీడు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు ఇ.పి.ని డి.హెచ్.ఆర్ నీకు చెందిన ఆస్తిని వేలం వేయించి డిక్రీ బాకీ వసూలు చేయు నిమిత్తం పై కోర్టులో ఇ.పి.ని దాఖలు చేయగా, సదరు ఇ.పి. నందు మీకు ఆర్డర్ 21 రూల్ 54 నోటీసులు ఎన్ని పర్యాయములు పంపినను మీరు సమన్లు తీసుకొనక తప్పి పంపుట వలన శ్రీ కోర్టు వారు మీకు నోటీసు నిమిత్తం తేది: 16-06-2025వ తేదీకి వాయిదా వేసియున్నారు. ఆ రోజు ఉదయం 10:30 గంటలకు పై కోర్టు నందు మీరు స్వయముగా గానీ, మీ తరపు అడ్వకేట్ ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వులతో)
మద్దెరి శ్రీరామిరెడ్డి,
అడ్వకేట్,
భాష్యం స్కూల్ దగ్గర,
ఎన్.ఎస్.నగర్, మార్కాపురం.

మలేరియా నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ

ర్యాలీని ప్రారంభిస్తున్న అబ్దుల్ గఫార్

ప్రజాశక్తి-కనిగిరి

మలేరియా నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, వైద్యాధికారి రూబీయా బేగం అన్నారు. మలేరియా నివారణా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం కనిగిరి పట్టణంలోని గార్లపేట రోడ్డులోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది జిల్లా మలేరియా అధికారి మధుసూదన్ రావు ఆదేశాలు మేరకు కనిగిరి సబ్ యూనిట్ మలేరియా అధికారి రామాంజనేయులు ఆధ్వర్యంలో మలేరియా వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులైన కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రజలుకు తెలిపారు. వైద్యాధికారి డాక్టర్ రుబీనా బేగం మాట్లాడుతూ చలి మరియు వణుకుతో కూడిన జ్వరము వస్తే వెంటనే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్తపరీక్ష చేయించుకొని తగిన చికిత్సలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సూపర్వైజర్ ఉమామహేశ్వర రావు, ఆరోగ్య కార్యకర్త తిరుపతయ్య మరియు సచివాలయం ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పొదిలి: వర్షాకాలంలో వేగంగా వ్యాప్తి చెందే మలేరియా నివారించేందుకు ప్రతి ఒక్కరు మేల్కొని ముందస్తు చర్యలు తీసుకోవాలని స్థానిక అర్బన్ పిహెచ్సి వైద్యులు డాక్టర్ శరత్ చంద్ర అన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు మలేరియా వ్యాధి నియంత్రించేందుకు చేపట్టిన మలేరియా మాసోత్సవంలో భాగంగా సోమవారం పొదిలి అర్బన్ పిహెచ్సి ఆవరణలో రోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ శరత్ చంద్ర మాట్లాడుతూ ముఖ్యంగా ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురికి నీటి గుంటలు లేకుండా తక్షణమే పూడ్చి వేయాలన్నారు. చెత్తాచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ వేయకూడదని వివరించారు. రాత్రి సమయాల్లో దోమల బారి నుంచి తప్పించుకునేందుకు దోమతెరలు వాడాలని సూచించారు. వేపాకు పొగ ద్వారా ఇంట్లోనే దోమలు రాకుండా నివారించవచ్చునని తెలిపారు. నిలువ నీరు నిలవకుండా జాగ్రత్త తీసుకోవాలని తెలిపారు. మలేరియా ఒక ప్రాణాంతక వ్యాధి అని, కానీ ఇది పూర్తిగా నివారించవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యశాఖ అందిస్తున్న మార్గదర్శకాలను పాటించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

దర్శి: మలేరియా మాసోత్సవాలలో భాగంగా జాతీయ కీటక జనని వ్యాధి నివారణ కార్యక్రమం క్రింద మలేరియా అవగాహనపై ర్యాలీని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శి పట్టణంలోని పాత ఎస్సీ కాలనీలో మలేరియా సబ్ యూనిట్ అధికారి నరావుల బసవారెడ్డి, యుపిహెచ్సి వైద్యాధికారి ఎంకె.చేతన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుహాసిని, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దగ్ధమైన ఇంటిని పరిశీలిస్తున్న నాయకులు

అమ్మనబ్రోలులో పూరిల్లు దగ్ధం

కాలిపోయిన నోట్లు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని అమ్మనబ్రోలులో షేక్ కరుముద్దీన్ అనే వృద్ధురాలికి చెందిన పూరిల్లు దగ్ధమైన సంఘటన సోమవారం జరిగింది. వివరాల మేరకు.. కరుముద్దీన్‌కు చెందిన పూరిల్లు షార్ట్ సర్క్యూట్ జరిగి ఒక్కసారిగా మంటలు రావడంతో పూర్తిగా దగ్ధమైంది. ఇంటిలో ఉన్న వస్తువులు అన్ని పూర్తిగా కాలిపోయాయి. వృద్ధురాలు కట్టుబట్టలతో మిగిలింది. దీంతోపాటుగా గృహ నిర్మాణం కోసం దాచుకున్న రూ.50 వేలు, పింఛను డబ్బులు రూ.4 వేలు, ఇంటి ఖర్చుల నిమిత్తం ఉంచుకున్న మూడు వేల రూపాయలు మొత్తం 57 వేలు పూర్తిగా కాలిపోయాయి. దుస్తులు, సామాన్లు, కరెంటు మీటరు, ఫ్యాన్లు, వంట సామాన్లు పూర్తిగా కాలిపోయి నిరాశ్రయురాలుగా మిగిలింది. సమాచారం తెలుసుకున్న టిడిపి మండల అధ్యక్షులు తేళ్ల మనోజ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని వృద్ధురాలిని పరామర్శించి ఖర్చుల నిమిత్తం రూ.5 వేల నగదు, బియ్యం బస్తా అందచేసి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే బి.ఎన్ విజయ్ కుమార్ దృష్టికి తీసుకు వెళ్లి ప్రభుత్వం నుంచి తగిన సాయం అందే విధంగా చూస్తామని తెలిపారు. పరామర్శించిన వారిలో మండల మైనార్టీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ బేగ్, మండల కోశాధికారి మెట్టు సుబ్బయ్య నాయుడు, ఎస్‌సి నాయకులు స్వర్ణ కిషోర్ బాబు ఉన్నారు.

తహశీల్దార్‌కు సమస్యను వివరిస్తున్న పిసి కేశవరావు

పేదలకు పట్టాలు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి మండలం ఏరువారిపల్లి పంచాయతీ పరిధిలోని ఈదల వాగు వద్ద 20 ఏళ్లుగా ప్రభుత్వ భూమిలో జీవనం సాగిస్తున్న పేదలకు పట్టాలు పంపిణీ చేయాలని సిపిఎం కనిగిరి పట్టణ కార్యదర్శి పిసి కేశవరావు కోరారు. బాధితులతో కలిసి మీ కోసం కార్యక్రమంలో భాగంగా తహశీల్దార్ ఏవి రవిశంకర్‌కు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ ఏరువారిపల్లి పంచాయతీ హాజీస్ పురం గ్రామ పరిధిలోని 539 సర్వే నెంబర్‌లో 27 కుటుంబాలు 20 ఏళ్లుగా నివాసాలు ఏర్పరచుకొని జీవనం సాగిస్తున్నారని, ఇంటి పన్ను కూడా చెల్లిస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 12న మర్రిపూడి మండలం గార్ల పేట విఆర్ఓగా పని చేస్తున్న ఎస్ సుబ్బారెడ్డి, పేరంగుడిపల్లికి చెందిన సైకం మాలకొండరెడ్డిలు ఈ స్థలం మాది అంటూ వారి అనుచరులతో కలిసి పేదల నివాసాలను కూల్చివేయడంతో వారు రోడ్డున పడ్డారన్నారు. నివాసాలను కూల్చివేయడంతో పాటు వారిపై అక్రమంగా కేసులు బనాయించి బెదిరింపులకు పాల్పడ్డారని తెలిపారు. పేదల భూమిని కాజేయాలని చూసిన వారిని, అందుకు సహకరించిన పోలీసులపై చట్టరీత్యా చర్యలు చేపట్టడంతో పాటు పేదలకు నివాస స్థలాల పట్టాలు మరియు గృహాల నిర్మాణానికి హౌసింగ్ బోర్డు ద్వారా పక్కా గృహాలు మంజూరు చేయించేలా చర్యలు చేపట్టాలని కోరారు. విచారణ చేసి పేదలకు న్యాయం చేసేందుకు చూస్తానని తహశీల్దార్ ఏవి రవి శంకర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్కే బషీర, బాధితులు ఎన్.ప్రభుదాసు, ఎన్.రవీంద్ర, ఎన్.నాగేశ్వరరావు, ఎం.రవీంద్ర, ఎన్.వెంకటేశ్వర్లు, ఎన్.ఏసు తదితరులు పాల్గొన్నారు.

సిఎస్‌పురం ఎస్ఐగా వెంకటేశ్వర నాయక్

ప్రజాశక్తి-సీఎస్‌పురం రూరల్

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ

సీఎస్‌పురం ఎస్ఐగా వెంకటేశ్వర నాయక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్ఐగా పని చేస్తున్న ఆర్.సుమన్ సెలవుపై వెళ్ళగా ఆయన స్థానంలో ఒంగోలు ఒకటవ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్న వెంకటేశ్వర నాయక్ బదిలీపై వచ్చి సోమవారం ఇక్కడ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు.

శిథిల భవనంలో భయం భయంగా..

ప్రమాదకరంగా మున్సిపల్ కార్యాలయం

ఆందోళన చెందుతున్న సిబ్బంది, ప్రజలు

పెచ్చులూడుతున్న భవనం శ్లాబు

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి మున్సిపల్ కార్యాలయ రెవిన్యూ శాఖ భవనం శిథిలావస్థకు చేరటంతో సిబ్బంది భయం భయంగా ప్రమాదం అంచున విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. కనిగిరి మున్సిపల్ కార్యాలయం రెవిన్యూ శాఖ భవనం శిథిలావస్థకు చేరింది. ఈ భవనం స్లాబు సిమెంటు పెచ్చులు ఊడి ఇనుప చువ్వలు బయటపడ్డాయి. దీంతో ఈ భవనంలో విధుల నిర్వహణ ప్రమాదకరంగా మారింది. రెవెన్యూ శాఖలో విధులు నిర్వహించే సిబ్బంది బిక్కుబిక్కుమంటూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొని ఉంది. ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందో అంటో ఆందోళన చెందుతూ భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. ఇక ఈ శాఖలో పన్నులు కట్టేందుకు, ఇతర రెవెన్యూ సర్వీసులు పొందేందుకు ఈ కార్యాలయానికి వచ్చే ప్రజలు కూడా ఈ భవనం స్థితి చూసి ఆందోళన చెందుతున్నారు. ఈ శిథిల భవనంలో ఎలా విధులు నిర్వహిస్తున్నారు అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ సర్వీసుల కోసం వచ్చిన తాము ఎక్కడ ప్రమాదం బారిన పడతారేమో అని ఆందోళన చెందుతున్నారు. ప్రమాదకర భవనంలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్న పాలకులు, అధికారులు ఈ శిథిల భవనం మరమ్మతులకు చర్యలు చేపట్టేందుకు దృష్టి సారించకపోవడం విచారకరం. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మున్సిపల్ కార్యాలయంలోని రెవెన్యూ శాఖ భవనంకు మరమ్మతులు చేపట్టి ఇబ్బంది లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

శ్రీనివాసమూర్తి సేవలు అభినందనీయం

శ్రీనివాసమూర్తి దంపతులను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ నాయకులు

ప్రజాశక్తి-చీమకుర్తి

ఏపీఎస్ఆర్టీసీ సంస్థలో 40 ఏళ్ల పాటు ఉత్తమ సేవలందించడంతోపాటు, వివిధ రంగాలలో సేవలు అందించిన పరాంకుశం శ్రీనివాసమూర్తి అభినందనీయులని పలువురు ప్రశంసించారు. స్థానిక చలువాది సత్యనారాయణ వెంకాయమ్మ కళా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శ్రీనివాసమూర్తి పదవీ విరమణ అభినందన సభలో పలువురు ప్రముఖులు మాట్లాడారు. ప్రముఖ సినీ, రంగస్థల నటులు రజిత మూర్తి మాట్లాడుతూ నాటక రంగంలో శ్రీనివాసమూర్తి అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని, ఆదర్శనీయమని పేర్కొన్నారు. రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు చెరుకూరి రఘు కిరణ్, శిద్దా సురేష్ కుమార్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ ప్రధాన కార్యదర్శిగా పరాంకుశం శ్రీనివాసమూర్తి అందించిన సేవలు మరువలేనివన్నారు. సిపిఎం జిల్లా నాయకులు పమిడి వెంకటరావు మాట్లాడుతూ చీమకుర్తి కళాభారతి, రోటరీ క్లబ్ సంస్థల ఆధ్వర్యంలో శ్రీనివాసమూర్తి స్ఫూర్తిదాయకమైన నాటక ప్రదర్శనలు, బాల ఉత్సవాలు నిర్వహించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పరంకుశం శ్రీనివాసమూర్తి దంపతులను పలువురు ఘనంగా సత్కరించారు. చందు డాన్స్ అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. ఒంగోలు గెలాక్సీ అధినేత చలువాది బదరీనారాయణ, హరిప్రియ గ్రానైట్స్ అధినేత నూనె వెంకటసుబ్రహ్మణ్యం, రోటరీ క్లబ్బు అధ్యక్ష కార్యదర్శులు కడవ రామకృష్ణ, కే సుధాకర్, రోటరీ క్లబ్ నాయకులు గొల్లపూడి వెంకటరావు, మన్నం ప్రసాదు, యడ్లపల్లి రాంబ్రహ్మం, మన్నం నాగరాజు, ఏ.వీరారెడ్డి, తొగటి శ్రీను, నాగ కుమారశర్మ ఆర్టీసీ నాయకులు కేవిన్ రావు, కొత్త కోట వెంకటేశ్వర్లు, ఆర్టీసీ మాజీ డిఎం సుందర్రావు, మద్దిపాడు ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి, డాక్టర్ చెరుకూరి వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు ప్రకాశరావు, శిద్దా నాగేశ్వరరావు, లైన్స్ క్లబ్ డైరెక్టర్ చదివాది రమేషు, నాటక రంగ ప్రముఖులు, ట్రేడ్ యూనియన్ నాయకులు, రోటరీ క్లబ్ నాయకులు, ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు పరాంకుశం శ్రీనివాసమూర్తి దంపతులను ఘనంగా సత్కరించారు.

దుకాణదారులను హెచ్చరిస్తున్న డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్

ఆక్రమణలు తొలగించాలి: డీఎస్పీ

ప్రజాశక్తి-పామూరు

ప్రజలకు ఆటంకం కలిగించే ఆక్రమణలను వెంటనే తొలగించాలని లేనిపక్షంలో వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కనిగిరి డిఎస్పి సాయి ఈశ్వర్ యశ్వంత్ హెచ్చరించారు. సోమవారం డిఎస్పి ఆదేశాల మేరకు పట్టణంలోని కందుకూరు రోడ్డు, సిఎస్పురం రోడ్డు, మెయిన్ రోడ్లలో సైడ్ కాలువలపై ఆక్రమణలు తొలగించే కార్యక్రమం చేపట్టారు. రోడ్లపైన బండ్లు పెట్టి వాహనదారులకు ప్రయాణికులకు ఆటంకం కల్పిస్తున్నారని ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. సోమవారం దుకాణదార్లకు తొలగించాలని లేనిపక్షంలో మేమే తొలగిస్తామని హెచ్చరిక చేసి వెళ్లారు. డీఎస్పీ వెంట సిఐ భీమా నాయక్, ఎస్సై అశోక్ బాబు ఉన్నారు.

యోగాతో శారీరక సామర్థ్యం

ప్రజాశక్తి-కొండపి

యోగాతో శారీరిక సామర్థ్యాన్ని పెంచుకోవచ్చని సీఐ సోమశేఖర్ అన్నారు. జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ రావు ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బందికి యోగ కార్యక్రమాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక, మానసిక, ఆరోగ్య రక్షణకు, ఒత్తిడి నివారణకు యోగా చాలా ఉపయోగపడుతుందన్నారు. సిబ్బందికి ఇటువంటి సమస్యలు తలెత్తిన వెంటనే తెలియజేయాలని వారి సమస్యలను పరిష్కరిస్తానని ఆయన తెలిపారు. అనంతరం సిబ్బందికి క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. ఈ మ్యాచ్‌లో సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు ప్రేమ్ కుమార్, రమేష్, సర్కిల్ పరిధిలోని సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎండియు వాహనాలను కొనసాగించాలి

ప్రజావిజ్ఞప్తుల్లో సిఐటియు నాయకుల వినతి

ప్రజాశక్తి - రేపల్లె

ఎండియు రేషన్ వాహనాలు కొనసాగించి పేదలకు ఎల్ల వద్దకే రేషన్ అందించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ పేర్కొన్నారు. ఎండియు రేషన్ వాహనదారులతో కలిసి తహశీల్దారు శ్రీనివాసరావుకు సోమవారం వినత పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండియు రద్దు ద్వారా వాహనదారులు, అసిస్టెంట్లు 18500 కుటుంబాలు రోడ్డున పడ్డారని అన్నారు. పేదలకు ఇళ్ల వద్దకే రేషన్ ఇచ్చే పథకం ఉపయోగకరంగా ఉన్న పథకం రద్దు చేయటం, రేషన్ షాపు వద్దే అందరికి పంపిణీ చేస్తామని, మరో పక్కన 65ఏళ్లు దాటిన వారికి, వికలాంగులకు ఇళ్ల వద్ద అందిస్తామని చెప్తున్నారని అన్నారు. కనీసం ఇప్పుడు పని చేస్తున్న ఎండియు వాహన దారులను వృద్ధులు, వికలాంగులకు ఇళ్లవద్దకు పంపిణీ చేయడం కోసమైనా ఉపయోగించుకుని వారికి ఉపాధి కల్పించాలి కోరారు. వాస్తవానికి 2027వరకు ఎండియు వాహన దారులను కొనసాగించటానికి ప్రభుత్వంతో ఒప్పందం ఉన్నప్పటికీ 2025 జూన్ 1 నుంచి రద్దు చేయటం అంటే ఉపాధి పొందుతున్న వారిని కూటమి ప్రభుత్వం రోడ్డున పడేసి మోసంచేయటమే అన్నారు. వాహనాలు కొనుగోలు కోసం బ్యాంకులు వద్ద తీసుకొన్న రుణం తాలూకా ప్రతినెల ఈఎంఐలు చెల్లించాల్సి ఉందని, ఇంకా 20 నెలల పాటు చెల్లించాలని, ప్రభుత్వం తాము చెల్లిస్తామని చెప్తుంది కానీ బ్యాంకర్స్ ఈఎంఐలు చెల్లించాలని వాహనదారుల మీద ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. నెలకు రూ.9వేలు ఈఎంఐ అదనంగా భారం పడుతుందని అన్నారు. ఎండియు తొలగింపు వల్ల వృద్ధాప్యం, అంగవైకల్యం వారికి సకాలంలో రేషన్ ఇంటి వద్ద ఆచరణలో అందదని అన్నారు. రాజకీయ కోణంతో కాకుండా ప్రజలను దృష్టిలో పెట్టుకుని ఎండియు వాహనాలు కొనసాగించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి ఎండియు ద్వారా ఉపాధి పొందుతున్న వారిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో ఎండియు వాహనదారుల యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు గోరిపర్తి గోపి మాట్లాడుతూ తామంతా ఎండియు వాహనాలు మీదే ఆధారపడి ఉపాధి పొందుతున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎండియు వాహన దారులను రోడ్డున పడవేయటం వల్ల కుటుంబ పోషణ ఇబ్బందిగా మారి, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. బ్యాంకులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఈఎంఐల భారం తమపై పడుతుందని అన్నారు. తమ సేవలను యథాతథంగా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు, సిపిఎం నేతలు కె ఆశీర్వాదం, కె రమేష్, వి మావో, వి లెనిన్, టి రవి, అంజన్ కుమార్, ఎస్‌కె రసూల్, కె గోపి, ధనుంజయరావు పాల్గొన్నారు.

వినతి పత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

కళాశాలను ప్రారంభిస్తున్న ఆలపాటి, వేగేశన

ఎన్నార్ై కళాశాల ప్రారంభం

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణంలో సూర్యలంక రోడ్డులో తెలుగుదేశం కార్యాలయం ఎదురు నూతనంగా నిర్మించిన భవన సముదాయంలో ఏర్పాటు చేసిన ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాలను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలిసి శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్సి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యా రంగంలో అనేక మార్పులు చోటుచేసు కుంటున్నాయని అన్నారు. ఈ పరిణామాల దృష్ట్యా అన్ని వర్గాల ప్రజలకు కార్పోరేట్ విద్య అందించేందుకు కృషి జరగాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎఒ ఐ కాశీవిశ్వనాథం

సిసిఆర్‌సి పత్రాలపై అవగాహన

ప్రజాశక్తి - వేటపాలెం

తహశీల్దారు పార్వతి, డిప్యూటీ తహశీల్దారు శ్రీకాంత్ ఆధ్వర్యంలో విఆర్ఓలకు సిసిఆర్సి పంట ధ్రువీకరణ పత్రాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఒ ఐ కాశీ విశ్వనాథం మాట్లాడుతూ మండలంలో 65 మంది కౌలుదారు రైతులు మాత్రమే సిసిఆర్సి కార్డులు పొందినట్లు చెప్పారు. ప్రతి రైతు సోదరుడు విధిగా కౌలు ధ్రువీకరణ పత్రం పొందాలని అన్నారు. వివిఎ, విఆర్ఓలు కలిసి గ్రామాల్లో కౌలు రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. కౌలు రైతులకు విధిగా కౌలు ధ్రువీకరణ పత్రం అందించాలని సూచించారు. ఆధార్ మిస్ మ్యాచ్ ఉన్న రైతును రెవిన్యూ రికార్డ్స్ నందు అప్డేట్ చేయడం వలన అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత సాధిస్తారని తెలిపారు. కనుక ప్రతి విఆర్ఓ వెబ్ ల్యాండ్ డేటాను ఆధార్‌తో అనుసంధానం చేయాలని సూచించారు.

మాట్లాడుతున్న ఎడిఎ మోహనరావు

కాలువ నీటిని ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని పూనూరులో ఖరీఫ్ వ్యవసాయానికి సమయాత్త సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశానికి ఎఒ మేరిమ్మ అధ్యక్షత వహించారు. ఖరీఫ్ సమాయత్త సమావేశం పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అధికారి ఎన్ మోహన రావు రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఖరీఫ్‌లో ముందుగా ఎన్ఎస్‌పి కెనాల్ నీటిని విడుదల చేయబో తున్నారని, కనుక రైతులు మొక్కజొన్న పంట సాగుచేసు కోవాలని తెలిపారు. వరి విత్తనాలు కెనాల్ వాటర్ రిలీజ్ చేసిన వెంటనే నారు మళ్ళు పోసుకోవాలని తెలిపారు. ఎఒ మేరిమ్మ మాట్లాడుతూ రైతులకు 50శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పచ్చిరొట్ట సాగుతో భూమి సారవంతం అవుతుందని అన్నారు. రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పూనూరు విఎఎ హరీష్, రైతులు ఈదల శ్రీనివాసరావు, బత్తుల సాంబయ్య, కృష్ణ, అజయ్ పాల్గొన్నారు

కూలీల వేతన బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - వేమూరు

ఉపాధి కూలీలకు గత రెండు నెలలుగా వేతనాలు విడుదల చేయలేదని, వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి ఆగస్టీన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని చావలి గ్రామంలో ఉపాధి పని ప్రదేశాల్లో పర్యటించి కార్మికులతో సోమవారం మాట్లాడారు. కూలీలు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకువచ్చినట్లు చెప్పారు. యోగాతో కడుపు నిండదని, వేతనాలు విడుదల చేస్తే కడుపు నిండుతుందని అన్నారు. ప్రతి కుటుంబానికి 100 రోజులు ఉపాధి పని కల్పించాల్సి ఉండగా ఎక్కడా అమలు జరగడం లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధికి గతేడాది కంటే నిధులు తగ్గించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేట్లకు పారితోషకం పునరుద్ధరించాలని అన్నారు. పనిలో గాయాలైతే కనీసం మెడికల్ కిట్స్ కూడా ఇవ్వడం లేదని, పలుగు, పార, పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న అగస్టీన్

కోటపాడులో నేత్రదానం

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని కోటపాడు గ్రామానికి చెందిన పేర్ని హను మయ్య (లేట్) భార్య పేర్ని వెంకా యమ్మ (91) ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆమె నేత్రాలను రోటరి క్లబ్ ద్వారా శంకర్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. శంకర్ కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది వచ్చి వెంకాయమ్మ కంటి కార్నియా సేకరించారు. వెంకాయమ్మ కోడలు పేర్ని పార్వతి, మనవరాలు గాయత్రి సహకారంతో మాజీ సర్పంచ్ తాటి చిన్న సుబ్బారావు, పేర్ని స్వరాజ్యలక్ష్మి ప్రేరణతో నేత్రదానం చేశారు.

పేర్ని వెంకాయమ్మ (91)

రంగారావుకు ఉపాధ్యాయ సేవా అవార్డు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు, విశ్రాంత ఉపాధ్యాయులు ఇంకొల్లు రంగారావు ఉపాధ్యాయ సేవా ప్రతిభ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన మెగా హెల్పింగ్ ఫౌండేషన్ వారిచే చిక్కడపల్లిలోని త్యాగరాయ గాన సభలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన అవార్డు అందుకున్నారు. హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ రామ్ తేజ్ సభకు అధ్యక్షత వహించి మాట్లాడారు. ఉపాధ్యాయులు చేసే పనిలో నిబద్ధత, గుండెల్లో దాతృత్వం, విద్యార్థుల పట్ల సహృదయం, పట్టుదల, ఆత్మవిశ్వాసం కలిగిన ఉపాధ్యాయులను అవార్డులతో సత్కరించడం అభినందనీయమని కొనియాడారు. సినీ నటుడు పృథ్వీరాజ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకులని అన్నారు. వారి సేవలు అమూల్యమైనవని, నిరుపమానమైనవని కొనియాడారు. అవార్డులు అందజేసిన మెగా హెల్పింగ్ ఫౌండేషన్ చైర్మన్ పి శిరీషరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఇంకొల్లు రంగారావుకు తమ సంస్థ తరపున అవార్డు ప్రదానం చేయడం తమ అదృష్టమని పేర్కొన్నారు. అవార్డు గ్రహీత ఇంకొల్లు రంగారావును చార్విక్, నిత్యానంద, వేదాంశిక శ్రీ, ఉపాధ్యాయులు కాటూరి నాగేశ్వరరావు, మరదప కోటేశ్వరరావు

సేవా ప్రతిభ అవార్డు అందుకుంటున్న ఇంకొల్లు రంగారావు

కెఎస్ జవహర్‌ను సన్మానిస్తున్న ఆనందబాబు

ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ జవహర్‌కు ఆనందబాబు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - వేమూరు

మాజీ మంత్రి కెఎస్ జవహర్ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా విజయవాడ ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా శాసన సభ్యులు నక్కా ఆనందబాబు దృశ్శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. గత ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ పాలనలో కార్పొరేషన్ ద్వారా ఎస్సీలకు మేలు జరుగుతుందని ఆనందబాబు ఆశాభావ వ్యక్తం చేశారు. ఆ మేరకు కార్పొరేషన్ చైర్మన్‌గా జవహర్‌ను ప్రభుత్వం నియమించడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. గడచిన ఐదేళ్ల కాలంలో ఎస్సీలకు ఎలాంటి రుణాలు గాని, ప్రత్యేక పథకాలు గాని అమలు జరగలేదని అన్నారు. వాటిని కూటమి ప్రభుత్వం పునరుద్ధరిస్తుందని అన్నారు. జవహర్ సారథ్యంలో కార్పొరేషన్ ఎస్సీల అభ్యున్నతికి పాటుపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి - బాపట్ల

చీరాల –పేరాల ఉద్యమ నాయకులు ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాల కృష్ణయ్య జయంతి వేడుకలు స్థానిక తహశీల్దారు కార్యాలయ ప్రాంగణంలో దుగ్గిరాల విగ్రహం వద్ద సోమవారం ఘనంగా నిర్వహించారు. దుగ్గిరాల విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిఐ రాంబాబు మాట్లాడుతూ ఉద్యమ కారుడు ఆంధ్రరత్న, చీరాల, పేరాల ఉద్యమంలో చురుకుగా పాల్గొని బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన దుగ్గిరాల గోపాలకృష్ణ అడుగుజాడల్లో నేటితరం నడవాలని అన్నారు. కార్యక్రమంలో ఫోరం ఫర్ బెటర్ కార్యదర్శి పిసి సాయిబాబు, తహశీల్దారు కార్యాలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దుగ్గిరాల విగ్రహానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - సంత మాగులూరు

మండలంలోని కామేపల్లిలో సోమవారం షిరిడి సాయిబాబా దేవాలయం 14వ వార్షికోత్సవం సందర్భంగా వైభవంగా ఆరాధన మహోత్సవాలు జరిగాయి. గ్రామంలో ఉదయం నుండి సాయంత్రం వరకు భక్తులతో తిరునాల వాతావరణం నెలకొంది. ఆలయ ధర్మకర్త బేతపూడి శంకరరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు భారీ అన్నదానం నిర్వహించారు. అనంతరం కోలాటాలు, విద్యుత్ ప్రభపై సాంస్కృత ప్రదర్శన నిర్వహించారు.

కూటమి ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా

4న వెన్నుపోటు దినం

వైసిపి ఒంగోలు పార్లమెంట్ ఇన్‌ఛార్జి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ప్రజలను వంచించిన కూటమి ప్రభుత్వ నిరంకుశ పాలనను నిరసిస్తూ ఈనెల 4న వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నట్లు వైసిపి ఒంగోలు పార్లమెంట్ ఇన్‌ఛార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. వైసిపి జిల్లాకార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలో ప్రజా వ్యతిరేకత తీవ్రంగా ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, చెప్పిన మాటలు ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. కూటమి అధికారం చేపట్టిన నాటి నుంచి ఎన్నికల హామీలు అమలు చేయాలని తమ పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అధికారాన్ని అడ్డుపెట్టుకుని కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని దుయ్యబట్టారు. ఏడాది కాలంలో 800 మందిపైగా దాడులు చేశారన్నారు. 400మంది వైసిపి కార్యకర్తలను కిరాతకంగా హత మార్చినట్లు ఆయన ఆరోపించారు. ప్రజలను నమ్మించి వంచించిన కూటమి పాలనకు వ్యతిరేకంగా రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఈనెల 4న వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్నికల ముందు, ఎన్నికలు అనంతరం ఏడాదిగా చంద్రబాబు నాయుడు చేసిన మోసాలను ప్రజలకు వివరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజల పక్షాన పోరాటం చేపట్టనున్నట్లు ఆయన వివరించారు. ప్రజల పక్షాన చేపట్టిన ఈ ప్రజా పోరాటంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. ఒంగోలు పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో వెన్నుపోటు దినాన్ని వైసిపి నాయకులు కార్యకర్తలు జయప్రదం చేయాలని ఆయన కోరారు వైసిపి ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చండూరు రవిబాబు మాట్లాడుతూ లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పిస్తానన్న చంద్రబాబు ఉద్యోగాల మాట అటుంచి వేలాది మంది ఉద్యోగాలను ఊడగొట్టారని దుయ్యబట్టారు. ఎక్సైజ్ శాఖలో 20 వేల మందిని, ప్రజా పంపిణీ వ్యవస్థలో 9,000 (ఎండియు) మందిని తొలగించారని ఆరోపించారు. రైతులకు ఇచ్చిన వాగ్దానాన్ని వమ్ము చేశారని, అమ్మ ఒడి పథకాన్ని అటకెక్కించారాని, బీసీలకు 50 ఏళ్లకు పెన్షను, ఆడపడుచులకు రూ.1500 భృతి లాంటి హామీలను అటకెక్కించారని విమర్శించారు. ప్రజలను నమ్మించి నయవంచన చేసిన చంద్రబాబుకు పాలన వ్యతిరేకంగా ఈనెల 4న వెన్నుపోటు దినం కార్యక్రమం సందర్భంగా ఒంగోలు అంబేద్కర్ భవన్ నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకూ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆర్‌డిఒ వినతిపత్రం అందజేయనునన్నట్లు తెలిపారు. అనంతరం వెన్నుపోటు దినంకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో వైసిపి ఒంగోలు నగర ఇన్‌ఛార్జి కటారి శంకర్, వైసిపి కొత్తపట్నం మండల అధ్యక్షుడు లంకపోతు అంజిరెడ్డి, వైసిపి ఒంగోలు రూరల్ మండల్ అధ్యక్షుడు మన్నే శ్రీనివాసరావు, వైసిపి జాయింట్ సెక్రెటరీ పాలడుగు రాజీవ్, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెక్రెటరీ పి.జాన్ ఐజాక్, జిల్లా కార్యదర్శి సయ్యద్ అప్సర్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

5 నుంచి ఐటిఐలో ప్రవేశాలకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

జిల్లాలోని ఐటిఐ కళాశాలలో 2025–2026 విద్యా సంవత్సరం ప్రవేశం కోసం ఈ నెల 5 నుంచి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ యువి.నాగేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 10 వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ ఒరిజినల్ మార్కులు జాబితా, టిసి, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డులతో ఒంగోలు ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో నిర్వహిస్తున్న కౌన్సిలింగ్ హాజరు కావాలన్నారు. 1వ ర్యాంకు నుంచి 259వ ర్యాంకు వరకూ 560 (10 జిపిఎ) మార్కులు నుంచి 368(6.4 జిపిఎ) సాధించిన విద్యార్థులు 5వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 1గంట వరకు కౌన్సిలింగ్‌కు హాజరు కావాలన్నారు. 260 (6.3జిపిఎ)ర్యాంకు నుంచి 496(2.0జిపిఎ) ర్యాంకు వరకూ 10వ తరగతి ఫెయిల్ అయినా, 8వ తరగతి పాసైన విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. 6వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జనరల్ పూల్ లోని అభ్యర్థులకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

హరినాథ్‌ను అభినందిస్తున్న నల్లూరి వెంకటేశ్వర్లు

శ్రీ ప్రతిభ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్

జెఈఈ అడ్వాన్స్ 2025 పరీక్షా ఫలితాలలో శ్రీ ప్రతిభ విద్యార్థి కాటూరి హరినాథ్ ఆల్ ఇండియా 994 ర్యాంకు సాధించిచాడు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందనలో శ్రీ ప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ నల్లూరి సీతా రామాంజనేయులు, సిఈఓ నల్లూరి జయప్రకాశ్ నారాయణ్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది తదితరులు హరినాథ్‌ను అభినందించారు.

కౌన్సిలింగ్ ద్వారా హెచ్‌ఎం పోస్టుల భర్తీ

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

గత 30న నిర్వహించిన హెడ్ మాస్టర్ ప్రమోషన్ కౌన్సిలింగ్ ప్రక్రియలో మిగిలిన 3, మే నెలాఖరున రిటైర్మెంట్‌తో ఖాళీ అయిన రెండు కలిపి మొత్తం 5 హెచ్‌ఎం పోస్టులను సోమవారం కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేశారు. గత నెల 30న ప్రమోషన్ ప్రక్రియను ఆన్‌లైన్ ద్వారా కమిషనరేట్ సీనియరిటీ లిస్టు రూపొందించి చేపట్టింది. మిగిలి పోయిన ఖాళీలను ఆఫ్‌లైన్ ద్వారా సీనియారిటీ జాబితాను పరిగణలోకి తీసుకోని నిర్వహించాలని కమిషనరేట్ సూచించింది. విద్యాశాఖ సూచనలు మేరకు జిల్లా విద్యా శాఖాధికారి కిరణ్ కుమార్ సీనియారిటీ జాబితాలోని 141 నంబరు నుంచి కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని సమాచారం అందించారు. అన్ని ఉపాధ్యాయ సంఘాలకు సమాచారం అందించారు. నిబంధనల మేరకు హాజరైన ఉపాధ్యాయ సంఘ ప్రతినిధుల సమక్షంలో ఖాళీగా ఉన్న పుల్లలచెరువు మండలం మర్రివేముల, దోర్నాల మండలం వై.చర్లోపల్లి, అర్థవీడు మండలం యాచవరం,రంగాపురం, పాపినేనిపల్లి పోస్టులను భర్తీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఇఒ కిరణ్ కుమార్, డిసిఇబి సెక్రటరీ మర్రి శ్రీనివాసరావు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై, ఎపిటిఎఫ్ అధ్యక్షుడు పివి.సుబ్బారావు, ఎ.అమ్మయ్య, ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు ఎర్రయ్య, బిటిఎ అధ్యక్షుడు పర్రె వెంకటరావు, పిఆర్‌టియు జిల్లా కార్యదర్శి పులి శ్రీనివాసరావు, ఎంఇఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.ఐజక్, వై.అనీల్ కుమార్, జి.యాకోబు తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ల సదస్సును జయప్రదం చేయండి

రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

స్థానిక ఎల్‌బిజి భవనంలో ఈనెల 12న నిర్వహిస్తున్న ఒంగోలు నగర అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ కం ఇస్త్రీదారుల సదస్సును జయప్రదం చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. కల్లగుంట శ్రీనివాసులు అధ్యక్షతన ఎల్‌బిజి భవనంలో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రజక వృత్తిదారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చీమకుర్తి కోటేశ్వరరావు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 79 ఏళ్లు గడిచినా అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ కం ఇస్త్రీదారుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని తెలిపారు. గ్రామాల్లో వందలాది కుటుంబాల వారు వత్తిని నమ్ముకొని చాలీచాలని కూలీతో పని చేస్తున్నారన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో టెక్నాలజీ పెరిగి వాషింగ్ మిషన్లు గ్రామీణ ,పట్టణ ప్రాంతాల్లో విస్తరించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వత్తికి , కూలీకి అవకాశాలు లేక అనేక మంది పట్టణ ప్రాంతాలకు వలస వచ్చినట్లు పేర్కొన్నారు. పట్టణాల్లో అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ ,ఇస్త్రీదారులు, ఇంటి పని వారుగా ఇరుకు గదుల్లో చాలీచాలని వేతనముతో కాలం గడుపుతున్నట్లు తెలిపారు. రజక వత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి రాయల మాలకొండయ్య మాట్లాడుతూ 50 సంవత్సరాల వయసు ఉన్న ప్రతి రజకునికి పెన్షను మంజూరు చేయాలన్నారు. ఇల్లు లేని వారికి ఇంటి స్థలాలు మంజూరు చేయాలన్నారు. రజకులకు సామాజిక రక్షణ చట్టం కల్పించాలన్నారు. తొలుత సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ కష్ణయ్య, చందలూరు శ్రీనివాసులు, పాదర్తి ఆంజనేయులు, కన్నవరపు నాగేశ్వరరావు, నాగేశ్వరావు నాయక్, శోభన బాబు, కె. బాలు, ఎన్. శ్రీనివాసులు, ఎం. ఏడుకొండలు, జటావత్ జక్వానాయక్, ఆరు బాబు, బూచిరాజు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డిఇఒకు వినతి పత్రం ఇస్తున్న ఎన్ఎస్‌టిఎఫ్ నేతలు

డిఇఒకు ఎన్ఎస్‌టిఎఫ్ వినతి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

స్పోజ్ ఆప్షన్ కు దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు స్పోజ్‌కు దగ్గరగా కోరుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్ కుమార్ సూచించారు.నాన్ స్పోజ్ టీచర్స్ ఫెడరేషన్ (ఎన్ఎస్‌టిఎఫ్) నాయకులు డిఇఒను కలసి స్పౌజ్ ఆప్షన్ గురించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ నిబంధనలకు భిన్నంగా వ్యవహరించిన యెడల వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. డిఇఒను కలసిన వారిలో ఎన్ఎస్‌టిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోమేపల్లి హనుమంతరావు, జిల్లా గౌరవాధ్యక్షురాలు కె. మాధవి, జిల్లా నాయకులు చప్పిడి కేశవరావు, అమరా శ్రీనివాసరావు, దామా సుబ్బారావు, చప్పిడి శీను, దామా రామాంజనేయులు, కందుల గంగాధర్,ఆరే శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

4న జాబ్ మేళా

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

స్థానిక గుంటూరు రోడ్డులోనున్న ప్రభుత్వ ఐటిఐ (బాలుర) కళాశాలలో ఈ నెల 4న క్యాంపస్ రిక్రూట్‌మెంట్ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ మరియు ప్రిన్సిపల్ యంవి.నాగేశ్వర రావు సోమవారం ఓ ప్రకటనలోతెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఈ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాకు ఐటిఐ చదువుతున్న, ఐటిఐ శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులు హాజరు కావచ్చుననని ఆయన పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో హైదరాబాద్ మరియు శ్రీసిటీ తదితర ప్రముఖ కంపెనీలు, గుళ్ళాపల్లి గ్రోత్ సెంటర్‌లోని కంపెనీలు, స్థానిక ఆటోమొబైల్ కారు షాప్‌లు, జిల్లాలోని ప్రముఖ కంపెనీ యాజమాన్యాలు పాల్గొని ఐటిఐ చదువుతున్న విద్యార్థును అప్రెంటిస్ శిక్షణ కోసం, ఐటిఐ పాసైన అభ్యర్థులను ఉద్యోగం కోసం ఎంపిక చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ప్రభుత్వ నింబధనల మేరకు శిక్షణా భృతి చెల్లిస్తారని తెలిపారు. ఐటిఐ పాసైన అభ్యర్థులందరూ తమ వివరాలను అప్రంటికేషనల్ పోర్టల్‌లో రిజిస్టరు చేసుకోవాలన్నారు. బయోడాటా, ఒరిజినల్ సర్టిఫికెట్లు, జెరాక్స్ కాపీలతో జాబ్ మేళాలో పాల్గొనాలని తెలిపారు. పూర్తి వివరాల అప్రంటీస్ అడ్వైజర్ 9703165456 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

అర్జీలను చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను చట్టపరిధిలో విచారించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్‌పి తుషార్ డూడి అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఎస్‌పి ఫిర్యాదులు స్వీకరించారు. అర్జీదారులతో వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలు సుకున్నారు. వాటిని చట్టపరిధిలో విచారించి పరిష్కరిస్తామని అర్జీదారులకు భరోసా కల్పించారు. భూవివాదాలు, కుటుంబ కలహాలు, ఆస్థి తగాదాలు, ఆర్థిక లావాదేవీలకు సంబందించిన మోసాలు ఇతర పలు సమస్యల పై వచ్చిన 44 అర్జీల పై సంబంధిత పోలీస్ అధికారులతో ఎస్‌పి మాట్లాడారు. ఫిర్యాది దారులు ఇచ్చిన అర్జీల పై తక్షణమే విచారణ చేపట్టాలని ఆదేశించారు. వాటి పూర్వాపరాలను క్షుణ్ణంగా తెలుసుకొని చట్టపరిధిలో పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిసిఎస్ డిఎస్‌పి పి.జగదీష్ నాయక్, పిజిఆర్‌ఎస్ సెల్ ఇన్‌స్పెక్టర్ యు.శ్రీనివాసరావు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి ఎంపిడిఒ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - రేపల్లె

ప్రసాద్ బాబు

రేపల్లె ఇంచార్జ్ ఎంపిడిఒగా వివిడివి ప్రసాద్ బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎం శోభారాణి ఉద్యోగ విరమణ పొందడంతో ఈఒపిఆర్డిగా పనిచేస్తున్న ఆయనకు ఇంచార్జ్ ఎంపిడిఒగా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రజల సమస్యల పరిష్కారానికి అన్ని విధాలా కృషి చేస్తానని అన్నారు. అన్ని వర్గాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు.

మాట్లాడుతున్న కారంచేడు ఎఒ కె సుధీర్‌బాబు

ఖరీఫ్ సాగుపై అవగాహన

ప్రజాశక్తి - కారంచేడు

మండలంలోని కారంచేడు రైతు సేవా కేంద్రంలో ఖరీఫ్ సీజన్ ముందస్తు సన్నద్ధతపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఒ కె సుధీర్ బాబు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ నందు ముందస్తుగా కెడబ్ల్యుడి కెనాల్ కింద నీరు వదిలినట్లయితే రైతులు సాగుకు సన్నద్ధతం కావచ్చని తెలిపారు. వరి పంట సాగు రకాలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ రత్తయ్య చౌదరి, టిడిపి నాయకులు కె నరేంద్ర, సాగునిటీ సంఘం ప్రెసిడెంట్ కామేపల్లి వీరనారాయణ, వైస్ ప్రెసిడెంట్ దగ్గుబాటి వెంకన్న, బోయన శ్రీనివాసరావు, విఎఎ జె జ్యోతి, జి లలితప్రియ, టి భవానీ పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

నిరుపేదలకు నివేశన స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - చీరాల

రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు నివేశన స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జెల్లి విల్సన్ కోరారు. సీపీఐ ఆధ్వర్యంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ స్థానిక ఎఐటియుసి కార్యాలయం నుండి తహశీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో భాగంగా నిరుపేదల పట్టణాల్లో 2సెంట్లు, గ్రామాల్లో 3సెంట్లు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నప్పటికీ ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టడం లేదన్నారు. గడచిన పదేళ్ల నుండి పేదలకు ప్రభుత్వాలు ఇండ్లు ఇవ్వలేదని గుర్తు చేశారు. గత వైసిపి ప్రభుత్వంలో పట్టణాల్లో ఒక సెంటు, గ్రామాల్లో ఒకటిన్నర సెంటు ఇస్తామంటే సీపీఐ వ్యతిరేకించిందని అన్నారు. చిన్న కుటుంబాలకు కూడా ఆ స్థలం సరిపోదని, ప్రస్తుత ప్రభుత్వం 2సెంట్లు పట్టణాల్లో, 3సెంట్లు గ్రామాల్లో ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దారు గోపి కృష్ణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు బత్తుల శామ్యూల్, మేడా వెంకట్రావు, ఎఐటియుసి అధ్యక్ష, కార్యదర్శులు దేవతోటి నాగేశ్వరరావు, బాసి పైడయ్య, మండల కార్యదర్శి కె వీరాంజనేయులు, పున్నారావు, వాడరేవు కార్యదర్శి పి నాగమణి పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచని సూర్యలంక బీచ్

- నెరవేరని ముగ్గురు కేంద్ర మంత్రుల హామీ
- కూటమి ప్రభుత్వంలో రూ.97కోట్లు మంజూరు

ప్రజాశక్తి - బాపట్ల

పర్యాటక రంగానికి ప్రాధాన్యత మరింతగా పెరిగింది. పర్యాటకులకు సరైన సౌకర్యాలు లేక పర్యాటక కేంద్రాల సందర్శనపై ప్రజలుకు ఆసక్తి సన్నగిల్లుతోంది. అయినప్పటికీ ప్రకృతి సహజసిద్ధ సుందర మనోహర సూర్యలంక తీరం రెండు తెలుగు రాష్ట్రాల్లోనే అద్భుతమైన పర్యాటక మణిహారంగా విరాజిల్లుతుంది. సూర్యలంక సముద్ర తీరం ఒక పుష్కర కాలంగా అభివృద్ధిలో ఒక అడుగు ముందుకు, రెండు అడుగులు వెనక్కి అన్నట్లు ఉంది. ఏమాత్రం అభివృద్ధికి నోచుకోక పర్యాటకులకు మరిన్ని సేవలు అందించలేకపోతోంది. 2013లో సూర్యలంక సముద్ర తీరంలో జరిగిన బీచ్ ఫెస్టివల్స్ అట్టహాసంగా నిర్వహించారు. అప్పట్లో బీచ్ ఫెస్టివల్ సంబరాలకు కేంద్ర మంత్రులు జెడి శీలం, చిరంజీవి, పనబక లక్ష్మి హాజరయ్యారు. సూర్యలంక బీచ్ ఫెస్టివల్స్ అత్యంత ఉత్సాహంగా కన్నుల పండుగలా ఆ రోజుల్లో నిర్వహించారు. బీచ్ అభివృద్ధికి తొలి విడతగా అప్పట్లో రూ.5కోట్లు కేటాయిస్తున్నట్లు కేంద్ర మంత్రులు ప్రకటించారు. ఆ తర్వాత ఎన్నికలు రావడం, రాష్ట్ర విభజన తర్వాత సూర్యలంక అభివృద్ధికి అమాత్యులు ఇచ్చిన హామీలు సముద్రపు అలల్లో కలసి పోయాయి. ముప్పలనేని శేషగిరిరావు ఎంఎల్ఏగా ఉన్న కాలంలో సూర్యలంక బీచ్‌లో మహిళలు దుస్తులు మార్చుకునేందుకు వసతి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. దీంతోపాటు నేరుగా సముద్రం అలల వరకు ప్రస్తుతం ఉన్న సిమెంట్ రోడ్డును ఆయన హయాంలోనే నిర్మించారు. తర్వాత 94 నుండి 2014 వరకు బీచ్ అభివృద్ధిపై ఎటువంటి పనులు జరగలేదు. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారం రావడం, అప్పట్లో రాష్ట్ర విభజన జరగడం, నవ్యాంధ్రలో సూర్యలంక సముద్ర తీరానికి ఒక సరికొత్త శోభ చేకూతుందని పర్యాటకులు ఆశించినట్లు ఇక్కడ అభివృద్ధి జరగలేదు. రాష్ట్రంలోని సముద్రతీర ప్రాంతాల్లో బీచ్ ఫెస్టివల్స్ నిర్వహించాలని పేర్కొన్నప్పటికి సూర్యలంక బీచ్ అప్పట్లో అందుకు నోచుకోలేదు. అప్పట్లో ఎంఎల్సిగా ఉన్న అన్నం సతీష్ ప్రభాకర్ హయాంలో బాపట్ల, సూర్యలంక రహదారి విస్తరణకు రూ.8కోట్లతో అప్పటి మంత్రి సిద్ధా రాఘవరావు చేతులు మీదుగా ఆవిష్కరించారు. సూర్యలంక మార్గంలోనే చప్టా అభివృద్ధి కోసం రూ.కోటి వరకు వెచ్చించారు. 2020 తర్వాత జరిగిన ఇక్కడ వైసిపి అధికారులకు వచ్చాక అప్పటి బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి సూర్యలంక అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినప్పటికీ అవి అమలు జరగలేదు. దాదాపుగారూ రూ.200 కోట్లతో సూర్యలంక మార్గంలోని అటవీ ప్రాంతంలో సీతాకోకచిలుకల పార్కును ఏర్పాటు చేయాలని ఒక ప్రతిపాదన చేశారు. సూర్యలంక బీచ్ ఇంటర్ కారిడార్ రహదారుల నిర్మాణానికి రూ.138 కోట్లతో ప్రణాళిక రూపొందించి కోన రఘుపతి ప్రతిపాదనలు పంపారు.

రాష్ట్ర పర్యాటక శాఖ బాపట్ల సూర్యలంక అభివృద్ధి కోసం ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి పంపినప్పటికి కార్య రూపం దాల్చలేదు. దీంతో దాదాపు ఒక పుష్కర కాలంగా ఎటువంటి అభివృద్ధికి నోచుకోకుండా సూర్యలంక అభివృద్ధి కేవలం ప్రతిపాదనలకే పరిమితమైంది. తాజాగా కూటమి ప్రభుత్వ హయాంలో రూ 97 కోట్లు నిధులు విడుదల కావడంతో సూర్యలంక అభివృద్ధికి బాటలు పడనున్నాయి. అయితే నేను పంపిన ప్రతిపాదనలు వల్లే నిధులు మంజూరు అయ్యాయని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి చెప్తున్నారు. కేంద్ర పర్యాటక శాఖతో సంప్రదించి నేను మంజూరు చేయించానని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ వెల్లడించారు. సూర్యలంక అభివృద్ధిపై అసెంబ్లీలో ఒకటికి రెండుసార్లు ప్రసంగించడం వల్లే నిధులు మంజూరు అయ్యాయని శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ చెబుతున్నారు. ఏదేమైనా సూర్యలంక అభివృద్ధికి నిధులు మంజూరు అయ్యాయి. అయితే బాపట్ల-సూర్యలంక -వాడరేవును కలుపుతూ ఒక రోడ్డు నిర్మాణాన్ని కూడా ఏర్పాటు చేసే విధంగా ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. 12 యేళ్ళుగా ఎటువంటి అభివృద్ధికి నోచుకోని బాపట్ల సూర్యలంక బీచ్ కూటమి ప్రభుత్వ హయాలో అభివృద్ధి జరిగే అవకాశాలు ఉన్నాయి. బాపట్ల సూర్యలంక అభివృద్ధి భవిష్యత్తులో ఎలా ఉంటుంది. దాన్ని ఏ విధంగా అభివృద్ధి చేస్తారని పర్యటక జనం ఆసక్తి ఎదురు చూస్తోంది.



సూర్యలంక బీచ్

కూటమి ప్రభుత్వం బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తుందా

2013 తర్వాత బాపట్లలో బీచ్ ఫెస్టివల్ బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి2020 నిర్వహించారు. అయితే ఈ ఏడు కాకినాడ, మచిలీపట్నం తదితర ప్రాంతాల్లో ఈ బీచ్ ఫెస్టివల్స్ ను అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. బాపట్ల సూర్యలంక బీచ్ లో 2025 బీచ్ ఫెస్టివల్ కూటమి ప్రభుత్వం నిర్వహిస్తుందా లేదా అనేది వేచి చూడాల్సిందే

శరవేగంగా అక్విడెక్టు నిర్మాణ పనులు

సిద్ధమవుతున్న మురుగు నీటిపారుదల ఖానాలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

భట్టిప్రోలు, వెల్లటూరు గ్రామాల మధ్య బిఎం డ్రైన్‌పై నిర్మిస్తున్న వెల్లటూరు ఛానల్ అక్విడెక్టు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. బ్రిటిష్ కాలంలో నిర్మించిన అక్విడేట్టు గత ఏడాది అక్టోబర్ నెలలో శిథిలావస్థకు చేరి విరిగిపోయిన సంఘటన పాఠకులకు విధితమే. దీంతో స్థానిక శాసన సభ్యులు నక్కా ఆనందబాబు, రేపల్లె శాసన సభ్యులు, రెవెన్యూ మంత్రి అనగానే సత్యప్రసాద్ కృషితో ప్రభుత్వం రూ.10.60 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఇంత పెద్ద ప్రాజెక్టు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ నాటికి పూర్తి అవుతుందో లేదోనని ఈ ప్రాంత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఉన్నతాధికారులు, గుత్తేదారు కలసి ఈ అక్విటెక్ట్ నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేసి శనివారం స్లాబ్ పూర్తి చేశారు. దీంతో ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే ఈ ఛానల్ కింద రైతులకు సాగు నీరు అందుతుందనే భావన ప్రతి ఒక్కరిలో కలిగింది. భట్టిప్రోలు, చెరుకుపల్లి, నగరం, నిజాంపట్నం మండలాల పరిధిలో 35వేల ఎకరాలకు ఈ ఛానల్ ద్వారా సాగునీరు అందుతుంది. కూటమి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన నిధులు మంజూరు చేయటం, వాటిని సకాలంలో సద్వినియోగపర్చి పనులు వేగవంతంగా పూర్తి చేస్తుండడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్విటెక్టివ్ నిర్మాణం అనంతరం దీనికి అనుసంధానంగా బిఎం డ్రైన్‌పై వంతెన నిర్మాణం చేపట్టి భట్టిప్రోలు, వెల్లటూరుకు ఛానల్ కట్టపై రాకపోకలు కొనసాగే విధంగా ఏర్పాటు చేయనున్నారు. అదే రీతిలో అక్విడెక్టుపై భగంలో వెల్లటూరు ఛానల్‌పై మరో వంతెన కూడా నిర్మించి ఇరువైపులా రైతులు రాకపోకలు కొనసాగించి వారి పంట ఉత్పత్తులను తరలించుకునే విధంగా అంచనాల్లో రూపొందించి నిర్మించనున్నారు. ఈ వంతెనల నిర్మాణ పనులు పూర్తి చేసుకుంటే కొన్నేళ్లపాటు రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉంటుందని ఆ ప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జూన్ నెల చివరి నాటికి అక్విడెక్టు నిర్మాణ పనులు పూర్తిచేసి ఖరీఫ్ సీజన్లో రైతులకు సాగునీటిని సకాలంలో విడుదల చేయాలనే దృక్పథంతో పనులు వేగవంతం చేసినట్లు నీటిపారుదల శాఖ ఏఈ సువర్చల వివరించారు.

స్లాబుకు సిమెంట్ కాంక్రీట్ చేస్తున్న కూలీలు

పిఎం కిసాన్‌తో రైతులకు ప్రయోజనం

ప్రజాశక్తి - ఇంకొల్లు

చిన్న, సన్న కారు రైతులకు పిఎం కిసాన్ మన్‌ధన్‌తో తక్కువ పొలాలు కలిగి ఉండి, రోజువారీ ఖర్చులకు వెచ్చించే జీవితం నుంచి విశ్రాంతి తర్వాత కూడా సురక్షితంగా జీవించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ మన్ధన్ యోజన పథకం తీసుకొచ్చింది. ఆరు గాలం కష్టపడి వృద్ధాప్యంలో జీవన పోరాటానికి అనేక సమస్యలు రైతులకు ఏర్పడుతున్నాయి. వారికి ఆసరాగా ఉండేందుకు ఈ పథకం ఉపయోగపడుతుంది. ఈ పథకం ద్వారా సన్న చిన్న కారు రైతులుకు వృద్ధాప్యంలో నెలకు రూ.3వేలు స్థిరమైన పెన్షన్ అందుతుంది. ఇది ఆ రైతులను భవిష్యత్తులో ఆదుకునే ఒక శాశ్వత ఆర్థిక భరోసా పథకంగా నిలబడనుంది. ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రధానంగా చిన్న, మార్జినల్ రైతుల కోసం రూపొందించింది. 60 ఏళ్లు పూర్తైన తర్వాత రైతులకు నెలకు రూ.3వేలు జమ చేస్తారు. అంటే ఏడాదికి రూ.36వేలు ప్రభుత్వం నేరుగా రైతుల ఖాతాలో జమ చేస్తుంది. ఇది సంపూర్ణంగా ప్రభుత్వ బీమా ఆధారిత పథకమైనందువల్ల నమ్మకంగా ఉంటుంది. 18 నుంచి 40ఏళ్ల మధ్య వయస్సు కలిగిన సన్న, చిన్న కారు రైతులు అర్హులు. ఇప్పటికే పీఎం కిసాన్ సమన్ నిధి పథకం లబ్ధిదారుగా ఉండాలి. రైతులు ఎంత త్వరగా ఈ పథకంలో చేరతారో వారు చెల్లించాల్సిన ప్రీమియం అంత తక్కువగా ఉంటుంది. ఆలస్యమై వయసు పెరిగేకొంది ప్రీమియం పెరుగుతుంది. ఉదాహరణకి 18 ఏళ్ల వయసులో చేరితే నెలకు కేవలం రూ.55 చెల్లిస్తే సరిపోతుంది. 30ఏళ్ల వయసులో అయితే రూ.110, 40 ఏళ్ల వయసులో అయితే రూ.220 చెల్లించాల్సి ఉంటుంది.

రిజిస్ట్రేషన్ చేయడం సులువు

maandhan.in అనే అధికారిక వెబ్‌సైట్‌కు వెళ్లి 'సెల్ఫ్ ఎన్రోల్మెంట్ అని' క్లిక్ చేస్తే మీ మొబైల్ నెంబర్‌కు ఓటిపి వస్తుంది. మొబైల్ నంబర్ ఓటిపి ద్వారా లాగిన్ చేసి, ఆధార్, వయసు, పేరు వంటి వివరాలు నమోదు చేస్తే సరిపోతుంది. తర్వాత మీ ప్రీమియం ఆటోమేటిక్‌గా బ్యాంక్ ఖాతా నుంచి డెబిట్ అవుతుంది. మన రాష్ట్రంతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో దేశం అంతటా వేలాది మంది రైతులు ఈపాటికే ఈ పథకంలో చేరారు. ఆలస్యం చేస్తే జీవితాంతం భద్రత ఇచ్చే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం ఉంటుంది. చిన్న వయసులో రైతులు ఈ పథకం కట్టడం ప్రారంభించి అధిక ప్రీమియం చెల్లించకుండా జీవితాంతం పెన్షన్ లబ్ధి పొందవచ్చు. వ్యవసాయ అధికారులు, బ్యాంకర్లు ఈ పథకంపై రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది. గ్రామీణ ప్రాంత రైతులకు భవిష్యత్తులో మేలు చేసే భీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. రాష్ట్రంలో 60 ఏళ్లు నిండిన రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్ పొందుతుంటే ఈ పథకం వర్తించదు.

గ్రామాన్ని దత్తత తీసుకున్నామన్నారు

- ఒక కేజీ పొగాకు కూడా కొనలేదు
- ఇళ్ళ ముందు మండెల్లోనే పొగాకు
- ఏమి చేయాలో అర్థం కావట్లేదు అంటున్న రైతులు
- ఆత్మహత్యలకు దారి తీసే పరిస్థితులు ఉన్నాయన్న రైతు
- ఈనెల 5న గుంటూరు జిపిఐ ఆఫీస్ ముందు ధర్నా

ప్రజాశక్తి - పంగులూరు

'ఆరికట్ల వారిపాలెం' అదొక చిన్న గ్రామం. ఆ గ్రామం వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తారు. ఈ గ్రామంలో సుమారు 400 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిలో గతంలో మిర్చి, శనగ, మొక్కజొన్న, మొదలైన వాణిజ్య పంటలు సాగు చేసేవాళ్లు. అయితే గతేడాది సుమారు 125 ఎకరాల్లో బర్లీ పొగాకు సాగు చేశారు. రైతులకు కొంత ఉపయోగంగా ఉంది. దీన్ని ఆసరాగా తీసుకొని జిపిఐ కంపెనీ గ్రామంలో మీటింగ్ పెట్టి ఆరికట్ల వారి పాలెం గ్రామాన్ని తమ కంపెనీ దత్తత గ్రామంగా తీసుకుంటున్నామని ప్రకటించారు. ఈ గ్రామంలో నల్లబర్లి పొగాకు బాగా సాగు చేయండి. రైతులు పండించిన ప్రతి చివరి కేజీ వరకు తాము కొనుగోలు చేస్తామని చెప్పారు. రైతులకు అండగా ఉంటామని అన్నారు. నల్లబర్లి పొగాకుకు మంచి గిరాకీ ఉంటుందని చెప్పారు. మంచి ధర పలుకుతుందని అన్నారు. సాగు చేయండని కంపెనీ ప్రతినిధులు రైతులతో చెప్పారు. కంపెనీ మాటలు విన్న రైతులు గ్రామంలో 400 ఎకరాల్లో నల్లబర్లి పొగాకు సాగు చేశారు. అయినకాడకు అప్పులు తీసుకొచ్చారు. బ్యాంకుల్లో, సొసైటీలో, బయట వడ్డీ వ్యాపారస్తుల దగ్గర వడ్డీలకు తెచ్చి పెట్టుబడి పెట్టి పొగాకు పండించారు. ఎకరాకు రూ.1.40లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. కౌలు రైతులైతే పోటీపడి కౌలు రేట్లు పెంచుకొని మరి పొగాకు సాగు చేశారు. సగటున ఎకరాకు 13 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. గ్రామంలో సుమారు 5,200 క్వింటాళ్ల పొగాకు రైతు దగ్గర ఉంది. దత్తత గ్రామం అన్నారు కదా తమ పొగాకు జిపిఐ కంపెనీ కొంటుందన్న ఆశతో రైతులు రెండు నెలలుగా ఎదురు చూస్తున్నారు. సాగు సమయంలో ఇంటింటికి తిరిగి బాండ్లు రాసుకున్న కంపెనీ ప్రతినిధులు రెండు నెలల నుంచి ముఖం చాటేశారు. కనీసం ఫోన్లకు కూడా అందుబాటులో లేరు. రెండు నెలల నుండి ఇళ్ళ ముందు మండలు కట్టుకొని, 15 రోజులకు ఒకసారి మండెలు తిరగేస్తూ, కంపెనీ వాళ్ళ కోసం కళ్ళు కాయలు కాసే విధంగా ఎదురు చూస్తున్నారు. ఇక కంపెనీ వాళ్లు పొగాకు కొనరనే నిర్ధారణకు వచ్చారు. ఇప్పుడు ఈ పొగాకు ఏమి చేయాలో దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. అప్పులు ఇచ్చిన వారికి ఏమి చెప్పాలి. కూలి వాళ్లకు డబ్బులు ఎలా ఇవ్వాలి. పిల్లల స్కూల్ ఫీజులు ఎలా కట్టాలి. ఇలాంటి ప్రశ్నలు ఎవరికి వారు వేసుకుంటూ ఏమి చేయలేని స్థితిలో నిస్సహాయంగా ఉన్నారు. ఈ పరిస్థితుల్లో "ప్రజాశక్తి" వారిని కదిలించింది. వారి మాటల్లోనే....

ఏదో ఒకటి చేసుకోవాలనిపిస్తుంది

గొర్రె వేణు బాబు. కౌలు రైతు

సొంత భూమి లేదు. ఎకరాకు రూ.25వేల చొప్పున కౌలుకు తీసుకొని నాలుగున్నర ఎకరాలు నల్లబర్లి పొగాకు సాగు చేశాడు .ఎకరాకు రూ.1.40లక్షలు పెట్టుబడి పెట్టాడు. మొత్తం బయట వడ్డీకి తీసుకువచ్చి సాగు చేశాడు. ఆకు కొట్టుడుకు వచ్చిన కూలీలకు ఇంతవరకు కూలి డబ్బులు ఇవ్వకపోవడంతో కూలీలు ఇంటి చుట్టూ తిరుగుతున్నారు. పిల్లాడి స్కూలుకు గత సంవత్సరం ఫీజు రూ.10 వేలు కట్టాలి. మళ్ళీ ఈ సంవత్సరం ఫీజు కట్టాలి. అప్పులు ఎలా తీర్చాలో, పిల్లాడి ఫీజు ఎలా చెల్లించాలో, కూలీలకు కూలి డబ్బులు ఎలా ఇవ్వాలో అర్థం కావటం లేదని. ఒక్కోసారి ఏదో ఒకటి చేసుకోవాలనే ఆలోచన వస్తుందని వేణు బాబు తెలిపాడు.

అప్పు చేసి సాగుకు పెట్టుబడి పెట్టా

ఎస్ అంజయ్య. కౌలు రైతు, మాజీ సర్పంచి

అరికట్లవారిపాలెం మాజీ సర్పంచి అంజయ్య తనకు 3 ఎకరాల సొంత భూమి ఉంది. మరో 17 ఎకరాలు కౌలు భూమి తీసుకొని నల్లబర్లి పొగాకు సాగు చేశాడు. రూ.25 లక్షలు పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. పెట్టుబడి మొత్తం బ్యాంకులు, బయట వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు తెచ్చినట్లు తెలిపారు. బయట అప్పులు ఇచ్చిన వాళ్లు విపరీతంగా అడుగుతున్నారని, వాళ్లకి ఏం సమాధానం చెప్పాలో అర్థం కావట్లే దని, ప్రతిరోజు సాయంత్రానికి తలనొప్పి వస్తుందని చెప్పాడు.

ఆలస్యమైతే నాణ్యత తగ్గే ప్రమాదం ఉంది

తలపనేని సుబ్బారావు, కౌలు రైతు.

గ్రామానికి చెందిన సుబ్బారావు తనకు ఒక ఎకరం సొంత భూమి ఉండగా 14 ఎకరాలు కౌలు భూమి తీసుకొని మొత్తం 15 ఎకరాల్లో నల్లబర్లి సాగు చేసినట్లు తెలిపారు. రూ.20 లక్షలు పెట్టుబడి అయినట్లు తెలిపారు. పొగాకు గత రెండు నెలల నుండి ఇంటి ముందే పడి ఉందని, అవి అమ్ముడు పోకపోగా వాటిని ప్రతి 15 రోజులకు ఒకసారి తిరగవేయాల్సి వస్తుందని తెలిపారు. ఈ క్రమంలో నాణ్యత తగ్గే అవకాశం ఉందని తెలిపారు.

పాలకుల చర్యలు ఆర్భాటమే

నల్లబర్లి పొగాకును కంపెనీలు చేత కొనిపిస్తామని పాలకులు రైతులకు ఇచ్చిన మాటలన్నీ ఆర్భాటమేనని, ఆచరణలో శూన్యమని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొదలుకొని వ్యవసాయ మంత్రి అచ్చం నాయుడు, జిల్లా మంత్రి గొట్టిపాటి రవికుమార్, పర్చూరు శాసన సభ్యులు ఏలూరు సాంబశివరావు అందరూ రైతుల పక్షాన తాము ఉన్నామని, పొగాకు వెంటనే కొనుగోలు చేయిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అయితే ఆ హామీ ఇంతవరకు నెరవేరలేదని అన్నారు. గ్రామాల్లో రైతులు పరిస్థితి బాగాలేదని అన్నారు. చివరికి ఏమవుతుందో అర్థం కాని పరిస్థితుల్లో రైతులు ఉన్నారని అన్నారు. ప్రభుత్వం, టొబాకో కంపెనీలు దిగివచ్చి రైతుల వద్ద నిల్వ ఉన్న పొగాకు మొత్తం కొనుగోలు చేసే వరకు రైతులు ఐక్యంగా ఉద్యమించాలని సూచించారు. అందులో భాగంగా ఈనెల 5న రైతు సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో గుంటూరులోని జిపిఐ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్నామని తెలిపారు. ఈ ధర్నాకు రైతులంతా ఐక్యంగా కలిసి రావాలని కోరారు.

యోగా శిక్షణ ఇస్తున్న మాస్టర్ వి పోలయ్య

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - రేపల్లె

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఎబిఆర్ కళాశాల యోగా మాస్టర్ వి పోలయ్య పేర్కొన్నారు. జూన్ 21న యోగ డే సందర్భంగా కళాశాల్లో యోగ శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోలయ్య మాట్లాడుతూ ఆధునిక జీవన శైలితో ప్రస్తుతం ప్రజలు అనేక మానసిక, శారీరక రుగ్మతలకు గురవుతున్నారని అన్నారు. ఉదయం 6.30 నుంచి 7.30 వరకు నిర్వహించిన శిక్షణలో 100 మంది శిక్షణ పొందినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టిసి రవి చంద్ర కుమార్, ఎన్‌సిసి ఆఫీసర్ కె బాలగురవయ్య, డాక్టర్ ఎం దాసు, బి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పర్చూరు : ఆరోగ్యకరమైన జీవితం కోసం ప్రతి ఒక్కరూ యోగ సాధన చేయాలని ఈఓపిఆర్‌డి కె సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక అద్దంకి నాంచారమ్మ కళ్యాణ మండపంలో సోమవారం మండల స్థాయిలో యోగా శిక్షణ నిర్వహించారు. స్వాస మీద ధ్యాస పెడితే ఏకాగ్రత పెరుగుతుందని అన్నారు. అనేక ఆరోగ్య సమస్యలకు పైసా ఖర్చు లేకుండా యోగాతో ఉపశమనం దొరుకుతుందని చెప్పారు. ఈనెల 21వరకు ప్రతిరోజూ ఉదయం 7గంటల నుండి యోగా శిక్షణ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నూతలపాడు ఆయుర్వేద డాక్టర్ డి శ్రీనివాసరావు, ఎంఈఓ వెంకట రామయ్య, ఎపిఎం రామకృష్ణ, పర్చూరు పంచాయతీ కార్యదర్శి ఎ మస్తాన్‌రావు, విఆర్ఓ వై శ్రీనివాసరావు, పిడి డాక్టర్ ఉదయ భాస్కర్ రెడ్డి, ఆర్ శివ స్వరూపారాణి పాల్గొన్నారు.

ఆర్భాటాలు తప్ప అభివృద్ధి కనిపించడం లేదు

ప్రజాశక్తి - బాపట్ల

కూటమి ప్రభుత్వంలో ఆర్భాటాలే తప్ప అభివృద్ధి ఎక్కడ కనిపించడం లేదని మాజీ శాసన సభ్యులు కోన రఘుపతి ఆరోపించారు. ఆయన తన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదైనప్పటికీ అభివృద్ధి శూన్యమని అన్నారు. నియోజకవర్గంలో తాను శాసన సభ్యునిగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధి తప్ప ఎక్కడ కోస మెరుపుగా కూడా అభివృద్ధి కనిపించడం లేదన్నారు. అబద్ధపు ప్రచారంతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. పెన్షన్ మాత్రమే అందించి సంక్షేమ పథకాల అమలు చేయడంలో పూర్తి స్థాయిలో వెనకబడి ఉందని అన్నారు. సూర్యలంక బీచ్ అభివృద్ధి కోసం రూ.97 కోట్లు మంజూరు చేశామని

మాట్లాడుతున్న కోన రఘుపతి

ప్రచార ఆర్భాటాలు చేస్తున్నారే తప్ప అక్కడ చేబట్టబోయే అభివృద్ధి పనుల డిపిఆర్ తయారు చేసి బహిరంగపర్చాలని డిమాండ్ చేశారు. ఈ నెల 4న జరిగే ప్రభుత్వ వెన్నుపోటు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో చేజర్ల నారాయణరెడ్డి, జోగి రాజా, బాపట్ల ఎఎంసి మాజీ చైర్మన్ డి సీతారామిరెడ్డి, వైసిపి రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి జయ భారతరెడ్డి పాల్గొన్నారు.

మాజీ సైనిక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఆదిశేషారెడ్డి

ప్రజాశక్తి - బాపట్ల

మాజీ సైనికోద్యోగుల సంక్షేమ సంఘం నూతన అధ్యక్షులుగా పుట్టా ఆదిశేషారెడ్డి నియమితులైనట్లు మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు తెలిపారు. పట్టణంలోని విజయలక్ష్మి పురంలోని మాజీ సైనిక సంక్షేమ సంఘ కార్యాలయంలో సోమవారం జరిగిన బాపట్ల మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ సంఘం సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఉపాధ్యక్షులు సిహెచ్‌వి కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి షేక్ మొహినుద్దీన్, సంయుక్త కార్యదర్శి పీటా సారధి, కోశాధికారి పువ్వాడ యల్లమంద ఎన్నికైనట్లు తెలిపారు. మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షునిగా ఉన్న తాండ్ర సాంబశివరావు రాష్ట్ర మాజీ సైనిక

మాజీ సైనిక ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం

సంక్షేమ సంఘం అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంలో ముఖ్య సలహాదారులుగా తోట దుర్గారావు, ఆడిట్ సభ్యులుగా షేక్ నిజాముద్దీన్, బక్క రామకృష్ణారెడ్డి, మునిపల్లె శ్రీనివాసరావు, సీనియర్ మహిళా సభ్యురాలు మాధవిలత పాల్గొన్నారు.

అర్జీ ఇస్తున్న సిపిఐ కార్యదర్శి ఏసోబు

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

ప్రజాశక్తి - సంతమాగులూరు

సూపర్ సిక్స్ పథకాలు, ఇండ్ల స్థలాల పంపిణీ ప్రక్రియ వెంటనే అమలు చేయాలని తహశీల్దారు కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నా నుద్దేశించి సిపిఐ కార్యదర్శి మల్లెల ఏసోబు మాట్లాడుతూ అధికారంలోకి రావడానికి ముందు తెలుగుదేశం, దాని మిత్రపక్షాలు ఇచ్చిన హామీల్లో భాగంగా పేద కుటుంబాలకు మూడు సెంట్లు స్థలం ఇస్తే రెండు సెంట్ల స్థలంలో ఇల్లు నిర్మించుకొని మిగిలిన సెంటు భూమిలో పాడి పశువులు, కోళ్ల పెంపకం చేసుకుంటారని అన్నారు. ఇండ్ల నిర్మాణానికి రూ.5లక్షలు ఇస్తామని చెప్పిన హామీని ఇంతవరకు అమలు చేయలేక పోయిందని ఆరోపించారు. అనంతరం వినతి పత్రాన్ని తహశీల్దారు కె రవిబాబుకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఖాదర్ భాషా, చీదర్ల కొండయ్య, పగిడి ఏసు, భూదాల వీరయ్య, షేక్ మౌలాలి పాల్గొన్నారు.

కనగాలలో మంచినీటి చెరువు పక్కనే వేసిన వ్యర్థాలు

తాగునీటి చెరువు ఒడ్డున వ్యర్థాలు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

మండలంలోని మేజర్ గ్రామమైన కనగాలలో ప్రధాన రహదారి వెంబడి వేస్తున్న వ్యర్థాలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కనగాల, ధూళిపూడి ప్రధాన రహదారిలో పంచాయతీకి కూత వేటు దూరంలోనే మంచినీటి చెరువు పక్కనే గ్రామంలోని వ్యర్థాలను వేస్తున్నారు. మంచినీటి చెరువులోకి వ్యర్థాలు వెళితే భూగర్భ జలాలు కలుషితం అయ్యే ప్రమాదం ఉంది. పక్కనే చెత్త సంపద కేంద్రం ఉన్నా పంచాయతీ సిబ్బంది దానిని వాడుకులోకి తీసుకురాకుండా ఇష్టానుసారంగా రోడ్డు పక్కనే పడేస్తున్నారు. అటుగా వెళ్లే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పంచాయతీ అధికారులు శ్రద్ధ పెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మహిళ మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని రామన్నపేట పంచాయితీ శ్రీ కనక నాగవరపమ్మ దేవస్థానం పరిసర ప్రాంతాల్లోని తోటలో గుర్తు తెలియని వృద్ధ మహిళ మృతదేహం సోమవారం వెలుగు చూసింది. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. పంచనామా నిర్వహించారు. మహిళ మృత దేహం 55 నుండి 60ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు. వృద్ధ మహిళ భిక్షాటన చేస్తూ మృతి చెంది ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. సుమారు 20 రోజుల క్రితమే మృతి చెంది ఉంటుందని అంచనా వేశారు. మృతదేహం ఎవరిదనేది ఎవరైనా గుర్తిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. మృతదేహంపై చీర జాకెట్ మాత్రమే ఉన్నాయని అన్నారు. శరీరం కుళ్లి పోయి ఎముకలు మాత్రమే కనిపిస్తున్నాయి. చీరాల రూరల్ సీఐ పి శేషగిరిరావు, వేటపాలెం ఎస్ఐ మీసాల వెంకటేశ్వర్లు పరిశీలించారు.

రేషన్ మాఫియాకు చెక్ పెట్టాలి

ప్రజాశక్తి - బాపట్ల

పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతుందని, రేషన్ మాఫియాను కట్టడి చేసేందుకు కార్యకర్తలు నడుం బిగించాలని మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ కోరారు. పట్టణంలోని పటేల్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బిజెపి జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవ సభలో ఆయన ఘాటైన విమర్శలు చేశారు.

రైతు సంక్షేమానికి ప్రత్యేక ప్రణాళికలు

- శ్యామల కాశిరెడ్డి
- డిసిఎంఎస్ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు స్వీకరిస్తున్న కాశిరెడ్డి

ప్రజాశక్తి -ఒంగోలు కలెక్టరేట్

రైతుల సంక్షేమానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డిసిఎంఎస్)చైర్మన్ శ్యామల కాశిరెడ్డి పేర్కొన్నారు. డిసిఎంఎస్ చైర్మన్‌గా జిల్లా సహకార అధికారి ఇందిరా దేవి నుంచి సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో కాశిరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కాశిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని రైతుల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. డిసిఎంఎస్ అధికారుల సహకారంతో సంస్థను మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చినా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్, జిల్లా మంత్రులకు, ఎమ్మెల్యేలకు కతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి ఇందిరా దేవి, సబ్ డివిజనల్ సహకార అధికారి జె.రామచంద్రనాథ్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ అజెండా అమలు చేయడమే మోడీ లక్ష్యం

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు

ప్రజాశక్తి-పామూరు

ప్రధాని నరేంద్ర మోడీ భారతదేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టి ఆర్‌ఎస్‌ఎస్ అజెండా అమలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు తెలిపారు. ఉగ్రవాదం మతోన్మాదం నశించాలి, ప్రపంచ శాంతి వర్ధిల్లాలి, మతసామరస్యం దేశ సమగ్రత పరిరక్షణకై సమైక్యత సదస్సు షేక్ ఖాదర్ బాషా అధ్యక్షతన సెయింట్ మార్క్స్ ఇంగ్లీష్ మీడియంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాబు మాట్లాడుతూ పాకిస్తాన్‌పై బిజెపి ప్రభుత్వం యుద్ధం ప్రకటించి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పాడని వెనక్కి తగ్గడం భారతదేశ ప్రజలను తాకట్టు పెట్టినట్టేనని ఆరోపించారు. నరేంద్ర మోడీ దుర్మార్గ పాలనను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. యుద్ధం ఆగడం పెట్టుబడిదారులకు అనుకూలమని గుర్తు చేశారు. బిజెపి వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి వాస్తవాలను కప్పిపెట్టి అబద్ధాలను ప్రచారం చేస్తూ ప్రజలను పక్కదారి పట్టిస్తుందని ఆరోపించారు. దేశంలో ఏం జరుగుతుందో ప్రజలకు తెలియకుండా మభ్యపెడుతున్నారని, మేధావులు విద్యావంతులు ప్రతి ఒక్కరు వాస్తవాన్ని పరిశీలించి ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రామాలలో గ్రూప్ మీటింగ్ ఏర్పాటు చేసి బిజెపి దుర్మార్గ పాలన గురించి ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం సిపిఎం కార్యకర్తలపై ఉందన్నారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ హనీఫ్, ఉసా వెంకటేశ్వర్లు, కె.మాల్యాద్రి, సయ్యద్ రషీద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పామూరు ప్రజా సంఘాల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకాశం జట్టు ఘన విజయం

విశాఖపట్నం జట్టుపై 7 వికెట్ల తేడాతో గెలుపు

విజయం సాధించిన ప్రకాశం జిల్లా జట్టు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి జర్నలిస్టుల క్రికెట్ టోర్నమెంట్‌లో ప్రకాశం జట్టు ఘన విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచిన విశాఖపట్నం జట్టు బ్యాటింగ్ చేపట్టి నిర్ణీత 16 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 122 పరుగులు సాధించింది. జట్టు కెప్టెన్ అమిత్ 36 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచారు. ప్రకాశం బౌలర్, కెప్టెన్ ఎంవిఎన్.కుమార్ 24 పరుగులిచ్చి నాలుగు వికెట్లు, కిరణ్‌కుమార్, కోటి, అబ్దుల్ ఖాదర్ చెరో వికెట్ సాధించారు. అనంతరం 123 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు 12.4 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి విజయం సాధించింది. వికెట్ కీపర్, బ్యాట్స్‌మెన్ వెంకట్ 23 బంతుల్లో 45 పరుగులు(5ఫోర్లు, 3 సిక్స్‌లు), కంకణాల అంకబాబు 36 పరుగులు చేసి జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించారు. మంగళవారం సెమీ ఫైనల్స్‌లో ప్రకాశం జట్టు చిత్తూరు జిల్లా జట్టులో తలపడనుంది,

వేసవి శిబిరాలతో బాలల్లో సృజనాత్మకత

ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి

మాట్లాడుతున్న కంకణాల రమాదేవి

ప్రజాశక్తి-దర్శి

బాలబాలికల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకే వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి తెలిపారు. స్థానిక సుందరయ్య భవన్‌లో గత మూడు రోజులుగా బాల బాలికలకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవుల్లో టీవీలు, ఫోన్లకు పరిమితమై లోక జ్ఞానాన్ని విస్మరిస్తున్నారన్నారు. జీవితంలో ఎదుర ్వుతున్న సమస్యలను ఎదుర్కోలేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. చిన్నచిన్న సమస్యలను కూడా పరిష్కరించుకోలేక ఆత్మహత్యల వైపు కొట్టుకుపోతున్న పరిస్థితి ఉందన్నారు. తాగుడు, జూదం, బెట్టింగ్, మత్తుపదార్థాలు సేవించడం లాంటివి ఈరోజు విపరీతంగా పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మూఢ నమ్మకాలకు దూరంగా శాస్త్రీయ భాగాల వైపు మరలటం లాంటి అనేక అంశాలు వారికి ప్రత్యేకంగా బోధించాల్సిన పరిస్థితి ఉందన్నారు. 3 రోజులుగా పాటలు పాడి, నేర్పించిన ప్రజానాట్యమండలి నాయకులు ఉప్పు మోహనరావును బాలోత్సవం నాయకులు, శిక్షణ పొందిన బాల బాలికలు శాలువకప్పి, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చిల్డ్రన్ క్లబ్ నిర్వాహకులు కెవి.పిచ్చయ్య, ఆదినారాయణ, నాగేశ్వరరావు లక్ష్మీ, రమ తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించను

- ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దు
- కలెక్టర్ తమీమ్ అన్సారియా

అర్జీలు స్వీకరిస్తున్న ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

గ్రీవెన్స్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించబోనని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోసం అర్జీదారులను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటే ఊరుకోబోనని అధికారులను హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి ఆమె అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మీకోసం కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తుండటంతో ప్రతి ఒక్క అర్జీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వాటికి అర్థవంతమైన సమాధానమిస్తూ పరిష్కారం చూపాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. వచ్చిన అర్జీలను నిర్దేశించిన గడువు లోపు పరిష్కరించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను అర్జీలు రీఓపెన్ కాకుండా చూడాలని ఆదేశించారు. అధికారులు లాగిన్ అయి ఆన్‌లైన్‌లో వచ్చిన వినతులను చూడాలన్నారు. సాంకేతిక సమస్యలతో పరిష్కరించలేని అర్జీలు వస్తే ఆ విషయాన్ని ప్రజలకు అప్పుడే స్పష్టం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీధర్, వరకుమార్, జాన్సన్, డిప్యూటీ కలెక్టర్ పార్థసారథి పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ పై అధికారులు ఆడిట్ చేయాలి

జిల్లా కలెక్టర్ వెంకట మురళి

బాపట్లలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకట మురళి

బాపట్ల జిల్లా: ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)పై అధికారులు ఆడిట్ చేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. కలెక్టర్ అధ్యక్షతన పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో 142 అర్జీలు నమోదయ్యాయి. తన పరిధిలోని అర్జీలకు కలెక్టర్ తక్షణమే పరిష్కార మార్గం చూపారు. మిగిలిన అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పిజిఆర్ఎస్‌లో నమోదైన ప్రతి అర్జీని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. సమస్య పరిష్కారమైతే అర్జీదారులకు లిఖిత పూర్వకంగా ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలన్నారు. తెలుగు భాషలోనే వాటిని జారీ చేయాలన్నారు. పరిష్కారమైన అర్జీలను నిబంధన ప్రకారం ఫోటోలతో అప్లోడ్ చేయాలన్నారు.

యోగాంధ్ర కార్యక్రమాలలో భాగంగా విద్యార్థినీ, విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ఈనెల 7 వరకు క్విజ్, వక్తృత్వ, 15 రకాల పోటీలు నిర్వహించాలన్నారు. 9 నుంచి 14 వరకు జిల్లా స్థాయిలో కళాశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించాలన్నారు. విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు చైతన్యవంతులు కావాలన్నారు. ప్రస్తుతం కోవిడ్ కేసులు బాపట్ల జిల్లాలో నమోదు కాలేదన్నారు. అయినప్పటికీ ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, బాపట్ల ఆర్‌డిఒ పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.